సహజీవన భావనల పావురాయి

రేటురాయి

వారపత్రిక 28-1-2022 ₹15/-

యమన్

ఏడేళ్ల యుద్ధం

టెక్‌ఫాగ్ గూఢచర్యం

ఆపదల్లో ఏం చేయాలి?

సమాజహిత భావనల సాధనాయి
గీతురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక: 4 హైదరాబాద్
శుక్రవారం 28 జనవరి 2022 రూ.15-00
24 జమాదివుల్ ఆఖిర్ 1443 హిజ్రీ

తొలిగీటు

ఒక దైవ విశ్వాసి పుణ్యఫలం పొందే సంకల్పంతో, తన భార్యాబిడ్డల కోసం ఖర్చు చేసినట్లయితే, అది అతనికి 'సదఖ' అవుతుంది. (బుఖారి)

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

సంపాదకులు
ఎస్.ఎమ్. మలిక్
అసోసియేట్ ఎడిటర్
అబ్దుల్ వాహెద్
ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి
ముహమ్మద్ ముజాహిద్
సబ్ ఎడిటర్
యాఖూబ్ షర్ఫీ
గ్రాఫిక్స్
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్
సర్క్యులేషన్ మేనేజర్
అబ్దుల్ జలీల్, 9704317015
సేల్స్ మేనేజర్
ముహమ్మద్ యాసీన్, 9700255736

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com

లోపల...

చరిత్ర పుటలపై రాజకీయ చెదలు	.....	04
ఎమన్ ఏడేళ్ళ యుద్ధం	.....	05
చరితార్థులు–అబ్దుల్ లతీఫ్ ఫారూఖి	.....	08
యుద్ధం ఇతర మతాలలో – 17	.....	09
ఆపదలో ఏం చేయాలి?	.....	12
టెక్‌ఫాగ్ గూఢచర్యం	.....	16
వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం)	.....	18
అడుగుజాడలు	.....	19
దైవ గృహం కాబా పునర్నిర్మాణం : 8	.....	20
యాప్స్ బాగోతం	.....	22
మన సమస్యలు తీరాలంటే...	.....	24
కుష్టు వ్యాధి – నివారణ	.....	27
పిల్లలతో ఇలా...	.....	30
సంక్షిప్త భారతం	.....	32
సర్వత్రా	.....	33

యూపీలో పోటీ...

వంద సీట్లలో పోటీ
చేస్తడంట ఒవైసీ
యోగీతో ఉన్నదా
లోలోపల ప్రైవసీ!
ఎదైనా చెయ్యిగాని
చీల్చకు మా ఓట్లను
పరోక్షంగ భాజపాకు
పంచకోయి సీట్లను!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

చరిత్ర పుటలపై రాజకీయ చెదలు

ఇప్పుడు బీజేపీ, జనతాదళ్ యునైటెడ్ మధ్య స్పర్థ మొదలయ్యింది. ఔరంగజేబుకు, అశోక చక్రవర్తికి మధ్య పోలికలున్నాయని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక మాజీ ఐఏయస్ అధికారి చెప్పిన మాటలు ఈ రాజకీయ దుమారానికి కారణం.

జనతాదళ్ యునైటెడ్ బీహారులో బలంగా ఉన్న పార్టీ. ముఖ్యంగా కుర్మీ, కుష్వాహా సముదాయాల బలంతో రాజకీయంగా నిలబడిన పార్టీ. ఇప్పుడు ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో జనతాదళ్ యునైటెడ్ స్వంతంగా పోటీ చేయాలనుకుంటోంది. బీజేపీతో సంబంధం లేకుండా మిత్రపక్షం స్వంతంగా పోటీ చేయడం బీజేపీకి ఎదురుదెబ్బ. ఇప్పటికే బీజేపీ నుంచి వెనుకబడిన వర్గాల నేతలు వరుసగా బయటకు వచ్చారు. బీహారు, ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కుల సమీకరణాలు చాలా ముఖ్యమైనవి.

పద్మశ్రీ అవార్డు గ్రహీత, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అయిన సిన్హా సమ్రాట్ అశోక్ అనే నాటకం రాశారు. ఆయన నవభారత్ టైమ్స్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఔరంగజేబుకు, అశోకుడికి మధ్య పోలికల గురించి చెప్పారు. ఇద్దరూ చాలా క్రూరమైన పాలకులని, సోదరులను హతమార్చారని, తండ్రిని జైలుకు పంపడం ఇద్దరూ చేశారని, తమ పాపాల ప్రక్షాళనకు జీవితం రెండవ దశలో మత నిబద్ధత చూపించారని ఆయన అన్నారు. తన పరిశోధనకు పునాదిగా ఉపయోగపడిన అధ్యయనాల గురించి కూడా ఆయన చెప్పారు.

అంతే జనతాదళ్ యునైటెడ్‌కు ఈ మాటలు నచ్చలేదు. సిన్హాపై కఠినమైన చర్యలు తీసుకోవాలని బీజేపీని డిమాండ్ చేసింది. అశోకుడు పాటలీపుత్ర అంటే ఇప్పటి పాట్నా నుంచి పాలించిన చక్రవర్తి. పైగా బీహారులో కుష్వాహా, కుర్మీ సముదాయాలు మౌర్య వంశంతో సంబంధం ఉన్న సముదాయాలుగా భావిస్తాయి. బీజేపీ కూడా 2015లో పాట్నాలో అశోకుడి 2320వ జయంతి ఉత్సవాలు జరిపింది. బీజేపీ ఈ ఉత్సవాలు జరపడానికి కారణం కుర్మీ, కుష్వాహా సముదాయాలను ఆకర్షించడానికే అని పలువురు అప్పట్లోనే వ్యాఖ్యానించారు.

డిసెంబర్ 13వ తేదీన ప్రధాన మంత్రి కాశీ విశ్వనాథ కారిడార్ ప్రారంభిస్తున్నప్పుడు ఔరంగజేబును విలనుగాను, శివాజీని హీరోగాను సూచిస్తూ మాట్లాడారు. ఔరంగజేబు దురాక్రమణకు పాల్పడిన ప్రతిసారీ ఒక శివాజీ జన్మిస్తాడని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఓటర్లను హిందూ ముస్లిం ప్రాతిపదికన విభజించడానికి ఉద్దేశించిన మాటలన్నది స్పష్టం. ఉత్తరప్రదేశ్ ఎన్నికలకు ముందు ఆయన ఇలాంటి మాటలు చెప్పకపోతేనే ఆశ్చర్యం.

ఇప్పుడు సిన్హా అనే రచయిత అశోకుడిని, ఔరంగజేబును ఒకే గాటన కడుతూ ఇద్దరి పోలికలను గురించి మాట్లాడడం మతతత్వ రాజకీయాలకు గొంతులో పచ్చి వెలక్కాయ అయ్యింది. ఆయనపై కేసు పెట్టారు. బీజేపీ పార్టీకి ఆ రచయితతో ఎలాంటి సంబంధం లేదని గొంతెత్తి ప్రకటించారు. కాని జనతాదళ్ యునైటెడ్‌కు చెందిన కుష్వాషా మాత్రం శాంతించడం లేదు. దయా ప్రకాష్ సిన్హా, అనే రచయితకు ఇచ్చిన పద్మశ్రీ, సాహిత్య అకాడమీ అవార్డులను వాపసు తీసుకోవాలని, ఆయన రాసిన పుస్తకాన్ని నిషేధించాలని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జనతాదళ్ యునైటెడ్‌తో పాటు, రాష్ట్రీయ జనతాదళ్ కూడా సిన్హా పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

ఏది ఏమైనా ఇప్పుడు రాజకీయాలను గమనిస్తే ఉత్తరప్రదేశ్‌లో ఔరంగజేబు వర్సెస్ శివాజీ, బీహారులో ఔరంగజేబు వర్సెస్ అశోకుడు. ఈ రాజకీయ సమీకరణాలు గమనిస్తే నేటి రాజకీయ వాతావరణం స్పష్టంగా అర్థమవుతుంది.

కవరు కథనం

అబ్దుల్ వాహెద్

ఎమన్ ఏడేళ్ల యుద్ధం

జనవరి 17వ తేదీన అబూదాబిపై డ్రోన్ దాడి జరిగింది. ఎమన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు ఈ దాడి తామే చేశామని ప్రకటించారు. ఈ దాడిలో ఇద్దరు భారతీయులు, ఒక పాకిస్తాన్ పౌరుడు కూడా చనిపోయారు.

అబూదాబిపై దాడికి ప్రతిచర్యగా ఎమన్ పై దాడులు జరిగాయి. ఎమన్‌లో హూతీల స్థావరం సనాపై సౌదీ అరేబియా రెండు వైమానిక దాడులు జరిపింది. ఈ వైమానిక దాడుల్లో 14 మంది మరణించారు. ఎమన్ లోని హూతీలపై సౌదీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సంకీర్ణ సైన్యాలు పోరాడుతున్నాయి. ఇక్కడ గమనించవలసిందేమిటంటే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబూదాబీపై హూతీలు దాడి చేశారు, కాని హూతీలకు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు ఎలాంటి ప్రత్యక్ష వైరం లేదు.

ఎమన్‌లోని ఈ అంతర్యుద్ధం, బయటి నుంచి సౌదీ సంకీర్ణ సైన్యాల దాడులు - ఈ మొత్తం అల్లకల్లోలం ఒక చిక్కుముడి లాంటిది. ఇక్కడ అనేక అంశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. హూతీలు ఎవరు? ఎమన్‌లో అంతర్యుద్ధం ఎందుకు ప్రారంభమయ్యింది? సౌదీ సంకీర్ణ సైన్యాలు ఎందుకు దాడులు చేస్తున్నాయి? ఈ యుద్ధంలో అబూదాబీ పాత్ర ఏమిటి? ఈరాన్ పోషిస్తున్న పాత్ర ఏమిటి? ఇలాంటి అనేక ప్రశ్నలకు జవాబులు తెలుసుకుంటేనే ఈ కల్లోలానికి కారణాలు కొంతవరకు అర్థమవుతాయి.

హూతీలెవరు? ఎమన్ అంతర్యుద్ధం ఎప్పుడు ప్రారంభమయ్యింది? ఈ అంతర్యుద్ధం అంతర్జాతీయీకరణ ఎలా ప్రారంభమయ్యింది? శాంతి ప్రక్రియ ఏమయ్యింది? ప్రపంచంలో అత్యంత తీవ్రమైన మానవీయ సంక్షోభంలో ఎమన్ ఎలా చిక్కుకుంది?

ఈ ప్రశ్నలన్నింటికి జవాబు అసలు హూతీలెవరు? అనే ప్రశ్నలో ఉన్నాయి. ఉత్తర ఎమన్‌లోని ఒక తెగ పేరు హూతీ. ఎమన్‌లోని జైదీ షియా ముస్లిం సముదాయానికి చెందినవారు. ఎమన్‌లో హూతీలు మైనారిటీలు.

హూతీల మొదటి రాజకీయ సైనిక సంస్థను ప్రారంభించింది ముహమ్మద్ అల్ హూతీ, హుస్సేన్ అల్ హూతీ సోదరులు. ఇది 1990లలో జరిగింది. ఇలాంటి మరికొన్ని సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. దీనికి కారణం ఎమన్‌లో సౌదీ అరేబియా ప్రాబల్యం పెత్తనం పెరగడం. అప్పటి ఎమన్ ప్రభుత్వం కూడా సౌదీ ప్రాబల్యాన్ని స్వీకరించేది. అప్పట్లో ఎమన్ అధ్యక్షుడు అలీ అబ్దుల్లా సాలిహ్. హూతీలకు సాలిహ్ ప్రభుత్వంపై నమ్మకం పోయింది. 2004లో హుస్సేన్ అల్ హూతీ నాయకత్వంలో సాలిహ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభమయ్యింది. అధ్యక్షుడు సాలిహ్ అవినీతికి పాల్పడుతున్నాడని, దేశంలోని సంపదను దోచుకుంటున్నాడని, సాలిహ్ కుటుంబం అవినీతి కార్యకలాపాలతో దేశాన్ని నాశనం చేస్తుందని ప్రధాన ఆరోపణలు వినిపించాయి. అంతకన్నా ముందు 2003లో అమెరికా ఇరాక్‌పై దాడి చేసింది. ఇరాక్ యుద్ధం ప్రారంభమయ్యింది. మధ్యప్రాచ్యంలో ఇరాక్ యుద్ధం వల్ల తలెత్తిన పరిస్థితి హూతీలకు కొత్త బలాన్నిచ్చింది. హూతీ యువత తిరుగుబాటు బాట పట్టారు. హూతీలు అధికారికంగా తమ సంస్థకు పెట్టిన పేరు అన్సారల్లా. లెబనాన్‌లో బలంగా ఉన్న హిజ్బుల్లా మాదిరిగా హూతీల అన్సారల్లా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఎమన్‌లో సౌదీ జోక్యాన్ని, అవినీతిని అంతం చేయడానికి పోరాడుతున్నామని ప్రకటించుకున్నారు. ఇక్కడ గమనించవలసిన చాలా విషయాలున్నాయి. అన్సారల్లా, హిజ్బుల్లా రెండు సంస్థలు కూడా షియా సంస్థలు. ఇస్రాయిల్ పట్ల ఈ రెండు సంస్థలు ఆగ్రహాన్ని కలిగి ఉన్నాయి. పాలస్తీనా పట్ల సానుభూతి కలిగి ఉన్నాయి. పాలస్తీనా ప్రజలు ఎక్కువగా సున్నీలు. కాబట్టి ఇది సున్నీ, షియా వైరంగా చూడడం కూడా సరికాదు. అన్సారల్లాగా ప్రారంభమైన హూతీలు తమ నినాదంలో ప్రకటించిన మాటలు కూడా గమనించదగినవి. "అల్లాహ్ అత్యున్నతుడు. అమెరికాకు వినాశం తప్పదు. ఇస్రాయిల్‌కు చావు తప్పదు. యూదులకు పరాభవం, ఇస్లాంకు విజయం". ఈ నినాదంలో సున్నీ షియా వైరం కనిపించదు. అమెరికా, ఇస్రాయిల్‌ల పట్ల ఆగ్రహం కనిపిస్తుంది. అమెరికా, ఇస్రాయిల్ పట్ల ఆగ్రహం సౌదీతో ఘర్షణకు, యుద్ధానికి దారితీసిన పరిస్థితులు గమనించవలసినవి.

ఎమన్ అధ్యక్షుడు సాలిహ్ సౌదీకి చాలా నమ్మకమైన వ్యక్తి. హూతీ తిరుగుబాటు ప్రారంభించిన హుస్సేన్ హూతీని ఎమన్ సైన్యం దాడుల్లో హతమార్చింది. ఆ తర్వాత హూతీ తిరుగుబాటు మరింత తీవ్రమయ్యింది. మరింత బలం కూడా పుంజుకుంది. ఎమన్ అధ్యక్షుడు సాలిహ్‌కు అప్పట్లో సౌదీ నుంచి పూర్తి సహకారం లభించింది. కోట్లాది డాలర్లు హూతీలపై పోరాటానికి సౌదీ ఇచ్చింది. సౌదీ ఎంత మద్దతు ఇచ్చినా సాలిహ్ సైన్యాలు హూతీలను అణచలేకపోయాయి. ఈ ఘర్షణలు చివరకు 2011లో అంతర్యుద్ధంగా మారాయి. హూతీలు ఒక ముఖ్యమైన శక్తిగా ముందుకు వచ్చారు. తమ దేశంలో హూతీల ప్రభుత్వానికి అంతర్జాతీయ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు.

ఇక్కడ గమనించవలసిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, 2010లో అరబ్బు వసంతం అరబ్బు దేశాలను కుదిపేసింది. తిరుగుబాట్లు పెచ్చరిల్లాయి. ఇది టునీషియా నుంచి ప్రారంభమయ్యింది. అక్కడి నుంచి ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు లిబియా, సిరియా, బహ్రెయిన్, ఈజిప్టులకు విస్తరించాయి. ఈ ఉద్యమాల ప్రభావం ఎమన్‌పై కూడా బలంగా పడింది. ఈ క్రమంలోనే 2011లో ఎమన్‌లో అధ్యక్షుడు సాలిహ్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు, నిరసనలు దేశమంతటా ప్రారంభమయ్యాయి. ఇది ఎమన్ విప్లవంగా చాలా మంది వర్ణించారు.

ఎమన్‌లో నిరంకుశ పాలనను, నిరుద్యోగాన్ని, అవినీతిని, పేదరికాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు నిరసనలకు దిగారు. ఈ నిరసనోద్యమాల్లో హూతీలు కూడా చురుగ్గా పాల్గొన్నారు. ఎమన్ విప్లవంలో హూతీలు పోషించిన పాత్రవల్ల చివరకు సాలిహ్ ప్రభుత్వం పతనమయ్యింది. 2012లో ఎమన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అబ్దుర్రబ్ మన్సూర్ హాదీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ మొత్తం అధికార మార్పిడి ప్రక్రియలో గల్ఫ్ సహకార మండలి (గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్) ప్రమేయం చాలా బలంగా ఉంది. గల్ఫ్ దేశాల ఈ వేదికలో సౌదీ అరేబియా బలమైన దేశం. గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్‌కు పెద్దన్న సౌదీ. ఎమన్‌లో కొత్తగా అధికారం స్వీకరించిన హాదీ విషయంలో అసంతృప్తి బలంగా ఉంది. ఆయన సౌదీ చేతుల్లో కీలుబొమ్మగా ప్రజలు భావించేవారు.

హాదీ పట్ల ప్రజల్లో ఎంత అనాదరణ, వ్యతిరేకతలు ఉండేవంటే హాదీకి వ్యతిరేకంగా అందరూ ఏకమయ్యారు. అంతకు ముందు సాలిహ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన హూతీలు కూడా సాలిహ్ తో చేతులు కలిపి కొంతకాలం ఐక్యపోరాటాలు చేశారు. స్థానిక ప్రజల మద్దతు, సాలిహ్ పట్ల విధేయత కలిగిన కొంతమంది ఎమన్ సైనికుల సహాయంతో హూతీలు చివరకు ఎమన్ రాజధాని నగరం సనాను ఆక్రమించుకుని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఇది 2015లో జరిగింది. అప్పటి నుంచి అంతర్యుద్ధం మరింత ఉధృతమయ్యింది.

రాజధాని నగరం హూతీల చేజిక్కిన తర్వాత ఎమన్ అధ్యక్షుడు హాదీ సనా నగరాన్ని వదిలి ఎమన్‌లోని మరో నగరం ఈడెన్‌కు పారిపోయాడు. ఎమన్ కొత్త రాజధాని నగరంగా ఈడెన్‌ను ప్రకటించారు. సనా నగరాన్ని హూతీలు ఆక్రమించుకున్న రెండు నెలల తర్వాత హాదీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ సౌదీ రంగ ప్రవేశం చేసింది. సౌదీ చేతుల్లో హాదీ కీలుబొమ్మ అనే ఆరోపణ లకు మరింత బలం లభించింది. ఈ యుద్ధంలో సౌదీకి మిత్ర దేశంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా రంగంలోకి రావలసి వచ్చింది. అంతకు మించి అబూదాబీకి హూతీలకు మధ్య ఎలాంటి వైరం లేదు.

ఎమన్‌లో హాదీ ప్రభుత్వానికి అంతర్జాతీయంగా అంటే సౌదీ తదితర దేశాల నుంచి మద్దతు లభిస్తున్నట్లే, ఎమన్‌లోని హూతీ లకు కూడా అంతర్జాతీయ మద్దతు ఉంది. ఎమన్‌లో సౌదీ కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పడడం ఈ ప్రాంతంలోని మరో పెద్ద దేశం ఈరాన్‌కు అస్సలు ఇష్టం లేదు. అందువల్ల ఈరాన్ కూడా ఇందులోకి అడుగుపెట్టింది. హూతీలకు మద్దతు ఇవ్వడం ప్రారంభించింది. నిజానికి ఇప్పుడు ఎమన్‌లో జరుగుతున్నది సౌదీ, ఈరాన్‌ల మధ్య పోరాటం. అది ఎమన్ అంతర్యుద్ధంగా కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో ఐసిస్ తదితర ఉగ్రవాద సంస్థలు కూడా ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా వాడుకునే ప్రయత్నాలు ప్రారం భించాయి. దేశంలోని కల్లోల పరిస్థితిని వాడుకుని ఉగ్రవాద దాడులకు పాల్పడి దేశంలోని కొన్ని ప్రాంతాలపై పట్టు బిగిం చాయి. ముఖ్యంగా ఎమన్ దక్షిణ ప్రాంతాల్లో బలపడ్డాయి.

ఎమన్‌ను కాస్త పరిశీలించి చూస్తే వియత్నాం వంటి పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అంటే 1960 నాటి పరిస్థితులను ఒకసారి గుర్తు చేసుకుంటే, అప్పట్లో అమెరికా సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధంలో దక్షిణాసి యాలో వియత్నాం ఎలా నలిగిందో అలాగే ఇప్పుడు సౌదీ, ఈరాన్‌ల మధ్య ఎమన్ నలుగుతోంది. 2014 నాటికి ఎమన్‌లో ఈరాన్ జోక్యం చాలా పెరిగింది. ఎమన్‌లోని హూతీలకు సహాయం చేయడం ప్రారంభించింది. ఈరాన్, హూతీల మధ్య స్నేహానికి చాలా బలమైన పునాదులు ఉన్నాయి. షియా సము దాయానికి చెందినవారే అందరూ. ఈరాన్, హూతీలు అమెరికా పట్ల తీవ్రమైన వ్యతిరేకత కలిగి ఉన్నవారు. ఈరాన్ సైన్యం హూతీలకు అవసరమైన సైనిక శిక్షణ అందించింది. ఆయుధాలు అందించింది. హాదీ ప్రభుత్వాన్ని కూల్చడానికి హూతీలకు కావల సిన బలాన్నిచ్చింది. సౌదీ అరేబియా ఈ పరిణామాలను తమాషా చూస్తూ కూర్చోలేదు. సౌదీకి దక్షిణాన ఎమన్ ఉంది. ఎమన్‌లో ఈరాన్ ప్రాబల్యం పెరగడం సౌదీకి అస్సలు ఇష్టం లేదు. ఈరాన్ మద్దతు వల్ల ఎమన్‌లో హూతీలు హాదీ ప్రభుత్వాన్ని పడగొట్టారు. 2015లో సౌదీ రంగంలోకి దిగి అంతర్జాతీయ గుర్తింపు ఉన్న హాదీ ప్రభుత్వాన్ని పునఃప్రతిష్ఠించే యుద్ధం ప్రారంభించింది. హాదీ సైన్యానికి మద్దతుగా సౌదీ సంకీర్ణ సేనలు వైమానిక దాడుల వరకు మాత్రమే పరిమితమయ్యాయి. కాల్బలం ఎమన్లో ప్రవేశిం చలేదు. సౌదీ మిత్రదేశంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా ఇందులోకి దిగింది. ప్రత్యక్షంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు హూతీలతో ఎలాంటి గొడవలు లేవు. అందువల్లనే గత కొన్ని రోజులుగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ యుద్ధంలో తన పాత్రను తగ్గిస్తూ వచ్చింది.

ఎమన్ అంతర్యుద్ధం ప్రపంచంలోని అతిపెద్ద మానవీయ సంక్షో భంగా ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఐక్యరాజ్య సమితి జనాభా నిధి ప్రకారం ఎమన్‌లోని 67 శాతం జనాభా, అంటే రెండు కోట్ల కన్నా ఎక్కువ మంది 2021 నాటికి అత్యంత దుర్భరమైన స్థితిలో మానవీయ సహకారం కోసం ఎదురు చూస్తున్నారు. దాదాపు 4 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. వీళ్ళంతా స్త్రీలు, పిల్లలే. ఎమన్ ఆర్థికంగా నాశనమైపోయింది. మరోవైపు కోవిడ్ వల్ల మాన వీయ సంక్షోభం మరింత పెరిగింది. శాంతి చర్చలు ఫలితాలను సాధించలేదు.

కరోనాను ఎదుర్కోడానికి ప్రపంచమంతా సతమతమవుతున్న కాలంలో ఐక్యరాజ్య సమితి ఎమన్‌లో పోరాటాన్ని ఆపాలని ఇరు పక్షాలను కోరింది. ఏప్రిల్ 2020లో సౌదీ అరేబియా కాల్పుల విరమణ ప్రకటించింది, అయినప్పటికీ అదే నెలలో అనేక సార్లు వైమానిక దాడులు జరిగాయి. ఈ కల్లోలం కొనసాగుతూనే ఉంది.

ఇప్పుడు అబూదాబీపై దాడి, ఆ తర్వాత ప్రతీకార దాడులతో పరిస్థితి మరింత క్లిష్టమయ్యింది. మొన్న జరిగిన అబూదాబీ దాడికి తామే కారణమని హూతీలు ప్రకటించిన తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విదేశాంగ మంత్రి నహ్యాన్ తీవ్రంగా ప్రతిస్పందిం చారు. సౌదీ, అమెరికాల మద్దతు యుఏయికి ఉంది. అమెరికా ఇప్పటికే హూతీ దాడిని ఖండించింది.

ఏడేళ్ళుగా ఈ యుద్ధం కొనసాగుతోంది. సమస్య పరిష్కారం అయ్యేలా లేదు. ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్య సమితి, ముస్లిం దేశాలు ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కారానికి ప్రయత్నిం చవలసి ఉంది. కోట్లాది అమాయక ప్రజలు ఈ అంతర్యుద్ధంలో సమిధలవుతున్నారు. ✤

'చరితార్థులు'



అబ్దుల్ లతీఫ్ ఫారూఖి (1893-1982)

113

✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

ప్రజలలో స్వేచ్ఛా-స్వాతంత్ర్య ఆకాంక్షను మరింతగా ప్రజ్వరిల్లచేయడం, బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలకు ప్రచారం కల్పించడం, జాతీయోద్యమ యోధులను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యం కార్యాచరణగా ముందుకు సాగిన అబ్దుల్ లతీఫ్ ఫారూఖి 1893 మార్చి 15న తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నయ్‌లో నవాబుల కుటుంబంలో జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలంలో విద్యాభ్యాసం సాగించిన ఆయన ఉర్దూ, తమిళం, ఆంగ్ల భాషలతోపాటుగా అరబిక్, పర్షియన్, హిందూస్తాని భాషలో ప్రత్యేక పాండిత్యం సంపాదించారు. ఆంగ్ల పాలకుల చర్యల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తూ వచ్చిన ఆయన 1920 ప్రాంతంలో ఆరంభమైన ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమం ద్వారా తొలిసారిగా అబ్దుల్ లతీఫ్ జాతీయోద్యమంలో ప్రవేశించారు. మహాత్మా గాంధీ మార్గాన అహింసాయుత ఉద్యమంలో పాల్గొనడం ఆరంభించారు. జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న ఆయన చర్యల పట్ల పలుమార్లు ఆంగ్ల ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ఆగ్రహాన్ని ఫారూఖి లెక్కచేయకపోవడంతో నవాబుల కుటుంబ సభ్యుడిగా ఆయనకు లభిస్తున్న వంశపారంపర్య 'పెన్షన్'ను ఆంగ్ల ప్రభుత్వం రద్దు చేసింది. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా జాతీయోద్యమానికి ప్రజల మద్దతు కూడగట్టేందుకు ఆయన సిద్ధమయ్యారు, ఆంగ్ల ప్రభుత్వ అక్రమాలను ప్రజలకు చేరవేయడానికి ఆయన 'ఆజాద్ హింద్' అను హిందుస్థాని దినపత్రికను ఆరంభించారు. ఆంగ్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను విమర్శిస్తూ ఆయన ప్రకటిస్తున్న సమాచారం పట్ల ప్రభుత్వం కన్నెర్రచేసింది. ఆ కారణంగా అదనపు సెక్యూరిటీ సమర్పణను డిమాండ్ చేస్తూ, 'ఆజాద్ హింద్' పత్రిక మీద నిషేధం విధించి, పత్రిక కార్యాలయాన్ని అధికారులు జప్తు చేశారు. 1926లో మద్రాస్ సెంట్రల్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వరాజ్య పార్టీ అభ్యర్థిగా పాల్గొన్న అబ్దుల్ లతీఫ్ విజయం సాధించారు. జాతీయోద్యమకారునిగా ఆయన భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన ప్రతి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1940లో ముస్లింలీగ్ చేసిన విభజన తీర్మానాన్ని వ్యతిరేకించారు. హిందూ-ముస్లిం ఐక్యతకు విభజన ప్రమాదకరం కాగలదని ఆయన హెచ్చరించారు. ప్రతిష్టాత్మక మద్రాస్ విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యునిగా 1942 నుండి 1945 వరకు పనిచేసిన అబ్దుల్ లతీఫ్ మద్రాసు అసెంబ్లీలోని ఎగువ సభలో ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు నిర్వహించారు. మద్రాసు నార్త్ సెంట్రల్ నుండి మద్రాస్ శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజల సంక్షేమం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ మద్రాస్ వక్ఫ్‌బోర్డు సభ్యునిగా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవిశ్రాంతంగా అబ్దుల్ లతీఫ్ విశేష కృషి జరిపారు. జాతీయోద్యమకారునిగా, పత్రికాధి పతిగా, ప్రజా ప్రతినిధిగా బహురంగాలలో బాధ్యతలను చిత్త శుద్ధితో నిర్వహించిన అబ్దుల్ లతీఫ్ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1972 ఆయనను ఘనంగా సత్కరించి గౌరవించింది. చివరి క్షణంవరకు ప్రజలతో ప్రత్యక్షసంబంధాలను నెరపిన మౌలానా అబ్దుల్ లతీఫ్ ఫారూఖి 1982లో కన్నుమూశారు. ✤

రచన: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ (రహ్మ) | సంక్షిప్తీకరణ, అనువాదం: ఎస్.ఎమ్ మలిక్

4. క్రైస్తవం

కాన్స్‌టాంటైన్ కాలంలోనయితే రాజ్యంలో దాదాపు సగం మంది విగ్రహారాధకులు. అందువల్ల అతను వారి పైన దౌర్జన్యకాండ జరిపేందుకు సాహసించలేకపోయాడు. అతను కేవలం మందిరాల ద్వారాలు, వాటి కప్పులు ధ్వంసం చేయించాడు. విగ్రహాల వస్త్రాలు, ఆభరణాలు తీయించి వాటిని ఆలయాల బయట వేయించాడు.[1] కాని కొన్నేళ్ళ తరువాత చర్చికే దేశమంతటా అధికారం ప్రాప్తమయినప్పుడు, క్రైస్తవ నాయకత్వం విగ్రహారాధనను అణచివేయాలని దృఢ సంకల్పం చేసుకున్నప్పుడు మతపరమయిన రెండు నియమాలు చేసుకున్నాడు. తద్వారా ఇతర మతాలను బలవంతాన తుడిచిపెట్టడానికి అనేక ఆదేశాలు ఉత్పన్నమవుతాయి :

1) ఏ పాపాలనయితే మెజిస్ట్రేటు నిషేధించడో లేదా శిక్ష విధించడో వాటి బాధ్యతలో స్వయంగా అతను కూడా ఓ మేరకు భాగస్వామి అయినట్లే.

2) కాల్పనిక దేవతల, వాస్తవ ప్రేతాత్మల విగ్రహారాధన, సర్వోన్నత సృష్టికర్తకు వ్యతిరేకంగా అత్యంత ద్వేషభరితమయిన నేరం.

ఇలా నిర్మించిన నియమాలను అమలుపరచడానికి ప్రథమంగా రోమను సెనెట్ నియమానుసారం ఓ తీర్మానం మంజూరు చెయ్యడం జరిగింది. దాని ప్రకారం, "రోమనుల మతం జూపిటర్ (Jupiter)ని ఆరాధించడం కాదు; క్రీసును ఆరాధించడం." ఆ తరువాత విగ్రహారాధన, వాటికి మొక్కుబడులు, బలులు సర్వం చట్టపరంగా నిషిద్ధమయ్యాయి. ఈ చేష్టలు చేసేవారికి కఠిన శిక్షలూ నిర్ణయమయ్యాయి.

ఫలితంగా విగ్రహారాధకుల్ని నిర్దాక్షిణ్యంగా సంహరించడం కాల్చడం, బలిగొనడం జరిగింది; మందిరాలను పడగొట్టడం, ధ్వంసం చెయ్యడం, గ్రీకు నిర్మాణ కళాఖండాలను ధ్వంసం చెయ్యడం జరిగింది. అనన్యమయిన ఈ దౌర్జన్యాల వల్ల కరవాల బలానికి వెరసి జనులు మనసులో నమ్మకపోయినా క్రైస్తవాన్ని బలవంతాన స్వీకరించసాగారు. కరవాల బలానికి 38 ఏళ్ళలోపున విగ్రహారాధన మటుమాయమయి రోమను సామ్రాజ్యమంతటా, యూరపు, ఆఫ్రికా ఇంకా ఇతర కొన్ని ఆసియా ప్రాంతాలకు సయితం క్రైస్తవం ప్రాకిపోయింది.

ఆ తరువాత క్రైస్తవులు, క్రైస్తవేతరులకు స్వయంగా క్రైస్తవుల మధ్య పరస్పరం జరిగిన పోరాటాలు వాటి సంఖ్య ఎలా ఉన్నా వాటిలో నైతిక, మానవీయ మూల్యాలను వదలిపెట్టిన వైనం, పోరాటాలు జరిగిన ఆటవిక విధానాల రీత్యా చారిత్రక గ్రంథాలు మసిబారిపోయాయి. క్రైస్తవేతర విశ్వాసాలను రూపు మాపడానికి క్రైస్తవ అనుయాయులు ఏ విధంగా శక్తినుప యోగించడాన్ని ధర్మబద్ధం చేసుకున్నారో దానికి నిదర్శనంగా ధార్మిక న్యాయస్థానాలను పేర్కొనవచ్చు; వాటిని ఇన్క్విజిషన్ (Inquisition) అని పిలిచేవారు. వీటిని స్వయాన రోమన్ పోపు ఆధ్వర్యాన స్థాపించేవారు. వీటిలో ధర్మ తిరస్కారం, దైవ తిరస్కారం, యూదత్వం, ఇస్లామ్, బహుభార్యాత్వం వంటి 'నేరాల'కు శిక్షించడానికి శిక్షాస్మృతి చెలామణిలో ఉండేది. వాటిలో అనేక శిక్షలతోపాటు మనుషుల సజీవ దహనం, నాలుకను కోసివేయడం వంటి శిక్షలూ ఉండేవి. ఒక్క స్పెయిన్‌లోనే ఈ ధార్మిక న్యాయస్థానం ద్వారా మూడు లక్షల 40 వేల మంది విభిన్న విధాలుగా సంహరించబడ్డారు. వీరిలో 32 వేల మందిని సజీవంగా దహనకాండకు గురిచెయ్యడం జరిగింది. ఇంతేకాక వేరే ప్రాంతాలలో ఈ మత న్యాయ స్థానాలు క్రైస్తవేతర నమ్మకాల కారణంగా సంహరింపజేసిన వారి సంఖ్య కనీసం లక్షన్నర ఉంటారని అంచనా వెయ్యడం జరిగింది.[2]

ఇదంతా పౌలు ప్రతిపాదించిన క్రైస్తవంలోని అసంపూర్ణ బోధనా ఫలితాల రెండవ పర్యవసానం. మొదటి పర్యవసా నంగానయితే తొలుత చూసిన దుర్దశ. ఆ మతం ఆదేశాలను పాటించడంలో క్రైస్తవులు అత్యంత మృదువైఖరినవలంబిం చారు. ఎదిరించే శక్తి ఉన్నప్పటికీ హింసా దౌర్జన్యాలను మూడువందల ఏళ్ళ వరకు తమ్ముతాము వినాశానికి గురి చేయించుకుంటూ వచ్చారు. మరి ఈ రెండవ పర్యవసానం ఏమిటంటే యాదృచ్ఛికంగా వారికి కాలపరివర్తనా ఫలంగా శక్తిని ప్రసాదించి ప్రభుత్వం, పరిపాలనా బాధ్యతలు ప్రాప్త మవగా వారు సంకుచిత క్రైస్తవ పరిధులను దాటి, మతంలో ఎలాంటి మార్గదర్శకత్వం, ఆదేశాలు పొందకపోవడం చేత తమ తోటి మానవ సోదరులపైన సకల విధాల హింసా దౌర్జ న్యాలను ధర్మసమ్మతం చేసుకున్నారు. తమ మనోభిరామం అనుసరణలో స్వేచ్ఛగా ఇష్టమయినదల్లా చేయడం మొద లెట్టారు. ఇంకా మూడవ పర్యవసానం ఏమిటంటే మతం పేరు చెప్పుకుని అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు, అజ్ఞానపు దురభిమానాలు గాలి దుమారంగా పేట్రేగిపోయి హద్దులు మీరిపోయినప్పుడు స్వయంగా వారికే మతం అన్న దాని పట్ల విద్వేషం జనించింది. ఇక వారికి పట్టుకునేందుకు పగ్గాలే కరువయ్యాయి. స్వయాన ఆ క్రైస్తవులే ప్రపంచ మంతటా ఎల్లెడలా మత రాహిత్యాన్ని వ్యాపింపజెయ్యడానికి సమాయత్తమయి అదే పనిగా నడుం బిగించి లేచి ఉద్య మించి విజృంభించారు!

ఒకటి మాత్రం వాస్తవం. దౌర్జన్యాలు, హింసాకాండ జరప డంలో కొందరు ముస్లిం రాజులు సయితం వెనుకాడలేదు. యుద్ధాల్లో ఆటవిక విధానాలకు కొందరు ముస్లిములూ పాల్పడ్డారు. ధర్మం పేరిట అధర్మ యుద్ధం సలపడంలో ముస్లిములను సయితం కాదనలేము. అయితే ఉభయుల్లో ఓ పెద్ద వ్యత్యాసముంది. ముస్లిముల చేష్టల ఏ బాధ్యతా ఇస్లామ్‌పైన రాదు. ఎందుకంటే మానవుని సహజమయిన సామూహిక అవసరాలన్నింటికి గాను ఇస్లామ్ సంపూర్ణ నియ మావళి, పరిపూర్ణ శాసన నిర్మాణం చేసి ఇచ్చింది. వాటిలో ఎటువంటి అసహజమయిన నిర్బంధాలూ లేవు, వాటిని పాటించడం చాలా కష్టమనడానికి. అలాగే పూర్తిగా ఎటు వంటి నిర్బంధాలూ లేని స్వేచ్ఛా లేదు, ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడానికి. అందువల్ల ఇస్లామ్ అనుయాయులు ఏ అనుచిత చేష్టలకు పాల్పడ్డారో అవన్నీ చట్టవిరుద్ధమయిన విగా పరిగణించబడతాయి. వాటి బాధ్యత చట్టంపైన రాదు. దీనికి భిన్నంగా క్రైస్తవం దాని అనుయాయులకు ఎటువంటి చట్టం చేసి ఇవ్వలేదు. అది బలహీనులయి ఉన్నప్పుడు బలం పొందవలసిన విధానం ఏదో బోధించలేదు, శక్తి పొంది నట్లయితే దాన్ని ఎలా వినియోగించాలో, ఇతర జాతులతో సంధి ఎలా కుదుర్చుకోవాలో, యుద్ధమయితే దాని లక్ష్యా లేవో, యుద్ధ మైదానంలో శత్రువులతో ఎలా ప్రవర్తించాలో, విజయాన్ని సాధిస్తే శత్రువుతో ఎలా మెలగాలి, ఇతర మతావ లంబీకులకు ఏ రాయితీలు ఇవ్వాలి, కాఠిన్యం వహిస్తే ఏ రంగాల్లో వహించాలో చెప్పలేదు. అందువల్ల క్రైస్తవ అను యాయులు మత పరిధిలోనూ, మత పరిధి దాటీ, ఎన్నెన్ని నైతిక నేరాలు చేశారో వాటన్నింటిలో క్రైస్తవం కూడా బాధ్యత వహించవలసి ఉంటుంది- ఎందుకంటే అది వారికి సంపూర్ణ జీవన మార్గం చూపడంలో నిష్ఫలమయింది!

1. Rev.Cutts. Constantine the great. P.278
2. Encyclopaedia Britanica Article: Inquisition)

5. నాలుగు మతాల బోధనలు- ఒక చూపులో

మేము గత పుటల్లో యుద్ధం గురించి ప్రపంచంలోని నాలుగు పెద్ద మతాల పంథాను వివరించాము. ఈ పంథాలు రెండు విభిన్న అతివాదాల నమూనాలు మనముందు ప్రదర్శిస్తున్నాయి. తొలి రెండు మతాలు యుద్ధాన్ని ధర్మబద్ధమయినవే అని అంటాయి. అవి మానవుణ్ణి అతని మనస్సు కోరిన అన్ని ఆశయాల కొరకు పోరాడే అనుమతినిస్తాయి. అవి, ఆశయాల్లో సత్యాసత్యాల విచక్షణను పాటించవు. మానవుని సమక్షంలో ఏదయినా ఉన్నత నైతిక ఆశయం ముందుంచి దాని వైపునకు శ్రద్ధచూపవు. పైగా మానవుల్ని పూర్తిగా భౌగోళికంగా, జాతి (RACE) రీత్యా, రంగు రీత్యా విభజించి ఒక్కో ప్రత్యేక జాతికి ఇతర జాతులకు లేని రాయితీలు ఇచ్చివేశాయి. మరోవైపున తరువాతి రెండు మతాలు మానవునికి స్వయంగా మానవుణ్ణి వేటాడే అనుమతినివ్వడం సరయిన పద్ధతి కాదని భావిస్తాయి. కాని ఈ భావన వారిని మరో అతివాదానికి తీసుకుపోతుంది. అవి యుద్ధానికెదురుగా పోరాడుతూ పోరాడుతూ కడకు స్వయాన మానవనైజంతోనే పోరాడటం మొదలెడతాయి. పరమ ప్రభువు మానవ జీవితంలో సంతులనం స్థాపించడానికి అతనిలో ఏ విభిన్న శక్తులనిచ్చాడో వాటిలో కొన్నింటిని ఇవి పూర్తిగా నాశపరచదలిచాయి, మరికొన్నింటిని పూర్తిగా మానవ ప్రకృతిపైన ఆధిక్యత సాధించేలా ప్రయత్నిస్తూ ఉంటాయి.

ఈ రెండు అతివాదాల మధ్య ఇస్లామ్ మధ్యేమార్గాన్ని, సంతులనాన్ని స్థాపిస్తూ ఓ మధ్యస్థ మార్గాన్ని సృజించింది. అది మానవ నైజానికీ, మానవ అవసరాలకూ తగిన అవశ్యకత ఏది కాగలదో, ఇంకా అన్నింటికంటే ముఖ్యంగా మానవ సంస్కరణను ప్రముఖ ఆశయంగా ముందుంచుకుని యుద్ధాన్ని రెండు విధాలుగా విభజించింది. ఒకటి, దేశాలను, సిరిసంపదల్ని, అధికారాలను పొందడానికీ, మనోకాంక్షల తృప్తికీ చేసే యుద్ధం. రెండు, సత్యం, ధర్మం, న్యాయస్థాపనకు, అన్యాయం అక్రమం హింసా దౌర్జన్యాలను రూపుమాపడానికి. మొదటిదాన్ని ఫిత్నాగా, మహాపాపంగా, విసర్జనీయంగా పరిగణిస్తుంది. రెండవది, చిత్తశుద్ధితో సత్యం కొరకే చేసినట్లయితే దానిని దైవ మార్గంలో పోరాటంగా, ఉత్తమ ఆరాధనంగా పరిగణిస్తుంది. దానికి పరిమితులు నిర్ణయిస్తుంది. అలా దైవం పేరు మీద పైశాచిక పీడల కార్యాలు జరగనట్లు మనిషి మనోకాంక్షలు అందులో ప్రవేశించకుండా ఉన్నట్లు జాగ్రత్తలు తీసుకుంది. వాస్తవం ఏమిటంటే యుద్ధం అన్న దాన్ని పరిపూర్ణంగా దాని సహజ పరిధుల్లో పరిమితం చెయ్యడంలో, దాన్ని ఆటవిక పోరు నుంచి నాగరిక పోరాటం, హింసాయుత కార్యం నుంచి న్యాయవంతమయిన స్థాయి వరకు, పాపం నుంచి పుణ్యం, విధి అయిన కార్యస్థాయి వరకు చేర్చడంలో ఇస్లామ్ చేసిన కృషి అనన్యం. ఈ శాసన విధానాన్ని అనుసరించినప్పుడే ప్రపంచం హింసా దౌర్జన్యాలనబడే పీడల నుంచి రక్షణ పొందగలదు, అప్పుడే పీడితులనబడేవారు ప్రపంచం నుండి తుడిచి వేయబడతారు. ✤

యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

విడిప్రతి	₹ 15
ఆరు మాసాల చందా	₹ 375
సాలుసరి చందా	₹ 750

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా
పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

మనిషిపై ఆపదలు, కష్టాలు ఎందుకు వచ్చి పడతాయి? అవి వచ్చినప్పుడు మనిషి ఏం చెయ్యాలి? అనే విషయాలను అల్లాహ్ స్పష్టంగా తెలియజేశాడు. ఆపదలు వచ్చిపడినప్పుడు అల్లాహ్‌ను సత్యంగా విశ్వసించినవారెవరో, అల్లాహ్‌ను విశ్వసించినట్లు నాటకమాడేవారెవరో స్పష్టంగా తెలిసిపోతుంది. ఈ విషయాన్ని అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా తెలియజేశాడు : మేము విశ్వసించాము అని అన్నంత మాత్రాన్నే వారిని పరీక్షించటం జరగదనీ ప్రజలు భావిస్తున్నారా? వాస్తవానికి మేము వారికి పూర్వం గతించిన వారందరినీ పరీక్షించాము. అల్లాహ్‌కు సత్య వాదు లెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా చూడ వలసి ఉన్నది". మనిషి విశ్వసించిన తర్వాత అతని విశ్వాసాన్ని పరీక్షించటం కోసం కూడా అల్లాహ్ అతనిపై ఆపదలను, కష్టాలను పంపుతాడు. అతను నిజమైన విశ్వాసి అయినట్ల యితే అతను ఈ పరీక్షలను చూసి బెదిరిపోడు, పలాయనం చిత్తగించడు. వాటిని ధైర్యంగా ఎదుర్కొంటాడు. ఒకవేళ అతనిలో కపటత్వం గనక ఉంటే అతను ఈ ఆపదలను చూసి బెదిరిపోయి వెనుదిరిగి వెళ్ళిపోతాడు. ఈ విధంగా సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో స్పష్టంగా తేలిపోతుంది.

ఇంకా ఆపదలు, కష్టాలు విశ్వాసి సహనాన్ని పరీక్షించటానికి అల్లాహ్ అవతరింపజేస్తాడు. ఎందుకంటే మనిషిలో సహనం అనే గుణం లేకపోయినట్లయితే అతనికి సంబంధించిన ఏ పనిని అతను సక్రమంగా నిర్వహించలేడు. కనుక ఈ ఆపదలు మనిషిలో సహనం అనే గుణాన్ని మరింత పెంచుతాయి. అంతేకాదు అసహనం అనే దుర్గుణం ఉన్నవారు స్పష్టంగా బహిర్గతమైపోతారు. ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా తెలియజేశాడు: (విశ్వసించిన కారణంగా) బాధలకు గురి చెయ్యబడినప్పుడు ఇల్లు, వాకిలీ విడిచిపెట్టినవారూ, వలసపోయినవారూ, సహనంతో వ్యవహ రించినవారూ- వారి కొరకు నీ ప్రభువు నిశ్చయంగా క్షమించేవాడు, కరుణించేవాడూను. (దివ్య ఖుర్ఆన్ 16 :110)

ఈ కష్టాలు కొన్నిసార్లు మనుషులు కలిగించేవిగాను, మరికొన్ని సార్లు ప్రకృతి వైపరీత్యాలుగాను కనిపిస్తాయి. ఏది ఏమైనప్పటికీ వాటిని సహనంతో భరించటం, వివేకంతో తొలగించుకోవటం, సహాయం కోసం కేవలం దైవాన్నే నమ్ముకోవటం తప్పనిసరి అయిపోతుంది.

కనుక ఆపదలు వచ్చిపడినప్పుడు ఒక విశ్వాసి ఖుర్ఆన్ గ్రంథాన్ని అత్యధికంగా పారాయణం చెయ్యాలి. ఇంకా అందులోని ఆజ్ఞలను అవగాహన చేసుకుని ఆచరించటానికి పూర్తి ప్రయత్నం చెయ్యాలి. ఇంకా అల్లాహ్‌పై పూర్తిగా నమ్మకం ఉంచాలి. ఆపదలను అవతరింపజేసేవాడు ఆయనే, తొలగించేవాడూ ఆయనే. కనుక ఆయన్నే వేడుకోవాలి. ఆయన సామీప్యాన్ని పొందే ప్రయత్నం చెయ్యాలి. తన విశ్వాసంలో రవ్వంత బలహీనత కూడా రాకుండా జాగ్రత్తపడాలి. మేము అల్లాహ్ పట్ల ఏ విధంగా నమ్మకం ఉంచుతామో అల్లాహ్‌ను అదేవిధంగా పొందుతాము.

ఇంకా ఆత్మ ప్రక్షాళనం కూడా చేసుకోవాలి. తనను తాను సమీక్షించుకోవాలి. తనలో ఉన్న లోపాలను వెలికితీయాలి. వాటిని సరిదిద్దుకోవాలి. ఎందుకంటే లోపాలతో కూడుకుని ఉన్న హృదయం ఆపదలకు త్వరగా ప్రభావితమవుతుంది. త్వరగా కలవరపడి తప్పుడు నిర్ణయాలు చేస్తుంది. అసహనానికి గురవుతుంది. నిరాశా నిస్పృహలకు లోనవుతుంది. కనుక ఆపదల సమయంలో మనస్సు పట్ల జాగ్రత్త వహించటం తప్పనిసరి.

ఆపదల సమయంలో మంచివారితో, దూరదృష్టి కలవారితో, మంచి సలహాలు ఇచ్చేవారితో స్నేహ సంబంధాలు పెంచుకోవాలి.

ఎందుకంటే అలాంటి సమయాలలో కొన ఊపిరితో ఉన్నవారికి కూడా ధైర్యాన్నిచ్చే ఒక చిన్న పలుకు కూడా ఎంతో బలాన్నిస్తుంది. పోయే ప్రాణం తిరిగి వచ్చేలా పనిచేస్తుంది. కొంత మంది స్నేహితులు ఎప్పుడూ నిరాశా నిస్పృహలకు చెందిన మాటలనే పలుకుతూ ఉంటారు. ధైర్యాన్నిచ్చే ఒక్కమాట కూడా మాట్లాడరు. వారి మాటలు ఆ సమయంలో ఎంతో సానుభూతి చూపినట్లు అనిపిస్తాయి. పదేపదే వారి నోటి ద్వారా అవే మాటలు వినాలని పిస్తుంది. కాని అలాంటి వారు అసలు సానుభూతిపరులు ఎంత మాత్రమూ కారు. వారి మాటలు రోజురోజుకు మనిషిని బలహీను నిగా చేసివేస్తాయి. చివరకు అతనిలో జీవించాలనే కోరిక సైతం నశించిపోతుంది. మరణం అతనికి ఎంతో మంచిదిగా అనిపి స్తుంది. ఒకవేళ ధైర్యాన్నిచ్చే సన్నిహితులు గనక ఉన్నట్లయితే వారి మాటల ద్వారా పర్వతాల్లాంటి ఆపదలు కూడా గులక రాళ్ళుగా కనిపిస్తాయి. ఆ ఆపదలు సాధారణ విషయాలుగా అనిపిస్తాయి. అప్పుడు అతను వాటిని ఒక ఛాలెంజీగా తీసుకుని ఎదుర్కోవటానికి సిద్ధపడతాడు.

సాధారణంగా అనేక ఆపదలు, కష్టాలు మనిషి తన చేతులారా కొనితెచ్చుకున్నవే అయి ఉంటాయి. ఎందుకంటే మనిషి తెలిసీ తెలియక ఎన్నో తప్పులు చేస్తూ ఉంటాడు. ఇంకా కావాలని నిర్భయంగా, దైవాన్ని సైతం లెక్క చెయ్యకుండా పాపకార్యాలు చేస్తూ పోతూ ఉంటాడు. అయితే ఈ రెండు సందర్భాలలో కూడా అల్లాహ్ మనిషిని సంస్కరించటానికి, అతనికి సరైన మార్గాన్ని సూచించటానికి కూడా కష్టాలను అవతరింపజేస్తూ ఉంటాడు. ఎందుకంటే మనిషికి ఆపదల సమయంలో ఆటంకం కలుగు తుంది. వేగంగా దూసుకుపోతున్న అతని కార్యాలు నెమ్మదిస్తాయి. అప్పుడు అతని ఆలోచనలు వెనుదిరుగుతాయి. అతను నెమ్మదిగా ఆలోచించటానికి, అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు అతని తప్పొప్పులు అతని కళ్ళ ముందు కదలాడుతాయి. దాని కారణంగా అతను పాపకార్యాల పట్ల తడబాటు ప్రదర్శిస్తూ అల్లాహ్‌ను క్షమాపణ కోరుకుంటాడు. తనను తాను సంస్కరించ టానికి ప్రయత్నిస్తాడు. అల్లాహ్ కోరేది కూడా అదే. అయితే అల్లాహ్ అతన్ని క్షమించి అతని ఆపదలను తొలగిస్తాడు. ఒకవేళ ఆపదలను, కష్టాలను చూసి కూడా క్షమాపణ కోరుకునే భాగ్యాన్ని గనక మనిషి నోచుకోకపోయినట్లయితే అల్లాహ్‌కు అతని పట్ల ఎలాంటి దయాభావం కలగదు. కనుక మనిషి ఆపదల సమయంలో క్షమాభిక్ష కోరుకోవటాన్ని అతనిపై తప్పనిసరి చేసుకోవాలి. దీనిద్వారా మనిషికి రెండు లాభాలు కలుగుతాయి. 1) అతని ఆపదలు తొలుగుతాయి 2) అతని పాపకార్యాలకు క్షమాభిక్ష కూడా లభిస్తుంది.

ఇంకా ఆపదలు వచ్చినప్పుడు మనిషి వెంటనే తేరుకోవాలి. తనపై బాధ్యతగా ఉన్న ప్రజలకు మంచి వైపునకు పిలిచే, చెడు నుంచి నిరోధించే కార్యాన్ని చేస్తూ ఉన్నట్లయితే దాని వేగాన్ని మరీ పెంచాలి. చెయ్యకపోతూ ఉన్నట్లయితే చెయ్యటం ప్రారంభిం చాలి. ఎందుకంటే ఈ కార్యాన్ని చెయ్యనివారంటే అల్లాహ్‌కు ఇష్టం ఉండదు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ఎవని చేతుల్లోనైతే నా ప్రాణాలున్నాయో ఆ అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. మీరు తప్ప కుండా ప్రజలకు మంచిని బోధించండి, చెడు నుండి నిరోధించండి. ఒకవేళ మీరు గనక ఈ కార్యం చెయ్యక పోయి నట్లయితే త్వరలోనే మీపై అల్లాహ్ శిక్షను అవతరింపజేస్తాడు. అప్పుడు మీరు అల్లాహ్‌ను వేడుకుంటారు. కాని మీ విన్నపాలను అంగీకరించటం అనేది జరగదు. దీనిద్వారా తెలిసిన విషయమే మిటంటే, ఆపదల నుండి రక్షింపబడాలంటే మనిషి తన రోజువారి అవసరాలను గురించి ఏ విధంగానైతే శ్రద్ధ వహిస్తాడో అదేవిధంగా మంచిని పెంచే, చెడును త్రుంచే విషయం పట్ల అంతగానే శ్రద్ధ వహించాలి. ఈ విషయం పట్ల ప్రతి ఒక్కరు స్వయంగా బాధ్యులే. ఈ కార్యం ప్రతి ఒక్కరిపై ఎందుకు విధిగా చెయ్య బడిందంటే, ఎవరు, ఎక్కడ చెడు చూశారో అక్కడే వారు వాటిని నిర్మూలించటానికి ప్రయత్నించినట్లయితే ఆ చెడు అక్కడే నశించిపోతుంది. అంతేకాదు, అక్కడ మంచి ఉద్భవిస్తుంది. ఈవిధంగా ప్రతి చోట, ప్రతి ఒక్కరు చేసినట్లయితే చెడుకు స్థానమే లభించదు. అప్పుడు సమాజం పరిశుభ్రంగా, ప్రశాంతంగా ఉంటుంది.

ఇంకా ఆపదలు, కష్టాలు వచ్చి పడినప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు కలిగినప్పుడు వాటి గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలి. మిడిమిడి జ్ఞానంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచెయ్యాలనే సంకల్పంతో తప్పుడు ప్రచారాలు చెయ్యకూడదు. స్వలాభం కోసం చాలామంది ప్రజలు అవగాహన లేని ప్రచారాలు చేస్తూ ఉంటారు. సాధారణంగా మనిషికి ఏ ఆపద వచ్చి పడినా మృత్యువు అతని కళ్ళ ముందు కదలాడుతుంది. మరణాన్ని సమీపంగా చూసి కూడా మనిషి తప్పుడు ప్రచారాలు చెయ్యటం ఎంతటి అవివేకమో ఆలోచిస్తే అర్థమవుతుంది. ప్రతి ఒక్కరు స్వయంగా పూర్తి అవగాహన తమకు కలిగేలా ప్రయత్నం చెయ్యాలి. పరలోక ప్రతిఫలాపేక్షతో ఆ అవగాహనను ఇతరులకు చేరవెయ్యాలి. ఆపదలను తొలగించుకోవటానికి దానికి కావలసిన మార్గాల న్నింటినీ అనుసరించాలి. ఉదాహరణకు వ్యాధిగ్రస్తులైతే చికిత్స చేయించుకోవటం, అనుకూలం లేని చోట నుంచి అనుకూలంగా ఉన్నచోటికి వెళ్ళటం లాంటివి.

మనో సంకల్పం

- ఆలియా బిన్తె మునీర్ షర్పియ

దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు:

"మానవుల ఆచరణలన్నీ కేవలం వారి సంకల్పాలపైనే ఆధారపడి ఉన్నాయి. సంకల్పం ప్రాతిపదిక పైనే మనిషికి ప్రతిఫలం లభిస్తుంది."

సంకల్పం అనేది మనస్సుకు సంబంధించినది. మనస్సులో ఏర్పడే నమ్మకమే సంకల్పం. ఒక మంచి పని తలపెట్టి నప్పుడు అది కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే చేస్తున్నామా లేక పరుల మెప్పు కోసమా అని ఆలోచింపజేసేదే సంకల్పం.

ఆచరణల మంచీ చెడులు, స్వీకార తిరస్కారాలు కేవలం సంకల్పంపై మాత్రమే ఆధారపడి ఉన్నాయని సమాజానికి స్పష్టం చేయడం ఈ హదీసు ముఖ్య ఉద్దేశ్యం. అంటే సత్ సంకల్పంతో చేసిన సదాచరణలకు మాత్రమే దైవా దరణ, విలువ ఉంటుంది. అలాకాకుండా ఎంతటి సదాచారం అయినా దుర్బుద్ధితో, దుష్ట సంకల్పంతో చేసినట్ల యితే అలాంటి ఆచరణకు దైవం దగ్గర ఎలాంటి ఆదరణ లభించదు. అది స్వీకార యోగ్యం కూడా కాదు. చూపులకు అది ఎంత మంచిగా కనిపించినప్పటికీ సంకల్పం ప్రకారం అది భ్రష్టాచరణగా, నిర్జీవ ఆచరణగా మాత్రమే పరిగ ణించబడుతుంది. దైవం ఆచరణతో పాటు సంకల్పాన్ని బాహ్యంతో పాటు అంతరంగాన్ని కూడా చూస్తాడు. ప్రతి ఆచరణ విలువనూ, దాన్ని ఆచరించే వాడి సంకల్పాన్ని బట్టే లెక్కగడతాడు.

ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మ) వారు ఇలా అన్నారు, ఇస్లాం మూల సూత్రాల హదీసులలో ఈ హదీసు ఒకటి: "ఆచరణలన్నీ కేవలం వారి సంకల్పాలపైనే ఆధార పడి ఉన్నాయి."

ఈ హదీసు ఎంత ప్రసిద్ధమైనదంటే ఇమామ్ బుఖారీ (రహ్మ) తన గ్రంథం "సహీహ్ బుఖారీ"ని ఈ హదీసుతోనే ప్రారంభించి ఏ సత్కార్యమైనా అల్లాహ్ ప్రసన్నత కోసం చేయకపోతే అది వృధా అవుతుంది అనే వాస్తవాన్ని తెలియ బరిచారు. అలాగే ఇహపర లోకాలలో సత్సంకల్పం లేని సత్కార్యానికి ఎటువంటి ప్రయోజనం ఉండదు అని సూచించారు.

ఇబ్నె ముబారక్ (రహ్మ) ఇలా అన్నారు : "చిన్న చిన్న సత్కార్యాలను కూడా సత్సంకల్పం గొప్పగా మార్చేస్తుంది. అలాగే పెద్ద పెద్ద సత్కారాలను కూడా దుష్ట సంకల్పం చిన్నవిగా మార్చేస్తుంది".

మనిషి ఏ సత్కార్యం చేసినా చిత్తశుద్ధితో చేయాలి. చిత్త శుద్ధి సత్సంకల్పంతోనే సాధ్యపడుతుంది. మన తెలుగునాట

"చిత్తశుద్ధి లేని పూజలేల" అనే నానుడి ఉంది. చిత్తశుద్ధి లేని పుణ్యకార్యాల వల్ల ఎటువంటి ప్రయోజనం లేకపోగా పరలోకంలో ఘోర నష్టం వాటిల్లుతుంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా సెలవిచ్చారు, "అల్లాహ్ మీ రూపురేఖలను, సిరిసంపదలను చూడడు. ఆయన మీ అంతర్యాలను, ఆచరణలను మాత్రమే చూస్తాడు".

అంటే ఏ పని చేసినా అల్లాహ్ ప్రసన్నత దృష్టిలో పెట్టుకొని చేయాలి. ఎందుకంటే దురుద్దేశంతో కలుషితమయ్యే ఏ పనీ అల్లాహ్ సమక్షంలో స్వీకృతిని పొందజాలదు. సంకల్పం అనేది అల్లాహ్ దృష్టిలో ఎంత గొప్పదంటే మనసులో అల్లాహ్ మార్గంలో యుద్ధం చేయాలనే సంకల్పం, ఆకాంక్ష ఉంటే చాలు, ఏదయినా ధర్మ బద్ధమైన అనివార్య కారణాల వలన యుద్ధంలో పాల్గొనక పోయినా అల్లాహ్ అటువంటి వ్యక్తికి ఇంటిలోనే దైవమార్గంలో పోరాటం సలిపినంత ప్రతిఫలం, పుణ్యం ప్రసాదిస్తాడని హదీసులో ప్రస్తావించడం జరిగింది. మనిషి సంకల్పం సవ్యంగా ఉంటే అతను తన భార్యాపిల్లల పై చేసే ఖర్చుకు కూడా పుణ్యం పొందుతాడు.

ఆచరణల్ని పాడుచేసే విషయాల నుండి అంతరంగాన్ని కాపాడుకోవాలి. ప్రాపంచిక వ్యామోహం లాంటి నీచమైన స్వార్థపూరిత భావాల నుంచి మనసును రక్షించుకోవాలి. హృదయాల స్థితి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. కనుక ఆచరణల నిజ స్వరూపం ఏమిటో ప్రళయ దినానే తెలిసివస్తుంది.

మనం నివసిస్తున్న ఈ ప్రపంచం, మన కార్యక్షేత్రం అయిన ఈ ఇహలోకం కేవలం 'బాహ్య ప్రపంచం, మన కర్మలకు సాక్ష్యం' మాత్రమే. ఇక్కడ మన తెలివి తేటలు, బుద్ధి జ్ఞానాల పరిధి కూడా బాహ్యదృశ్యాల వరకే పరిమితం. అంటే, ఇక్కడ ఆచరణల ద్వారా మాత్రమే ఒక మనిషి పై సదభిప్రాయం గాని, దురభిప్రాయం గాని ఏర్పరచుకో గలం. ఆ ప్రాతిపదికపైన్నే అతనితో సంబంధాలు పెట్టు కుంటాం. బాహ్య ఆచరణల ద్వారా వారి సంకల్పాలను, వారి హృదయ రహస్యాలను, మనసులోని భావాలను తెలుసుకునే శక్తి మనకు లేదు. అందుకే హజ్రత్ ఉమర్ (రజి) ఇలా సెలవిచ్చారు: "ఇక్కడ బాహ్య విషయాల పై తీర్పు నివ్వడమే మన పని. కానీ దాగి ఉన్న రహస్యాలు కేవలం అల్లాహ్‌కే తెలుసు." అయితే పరలోకంలో మాత్రం తీర్పు చెప్పేవాడు అన్ని రహస్యాలు ఎరిగిన జ్ఞాని. అక్కడ ఆయన తీర్పులు సంకల్పాలు, ఉద్దేశ్యాలను బట్టి ఉంటాయి. ఆచరణల విషయంలో ఇక్కడ బాహ్య ఆచరణలు అత్యంత ప్రముఖమైనవి. సంకల్పాల ఆధారంగా ఇక్కడ ఎలాంటి తీర్పు ఇవ్వడం జరగదు. అదేవిధంగా పరలోకంలో కూడా వ్యవహారం దీనికి భిన్నంగా ఉంటుంది. అక్కడ అల్లాహ్ నిర్ణయం సంకల్పంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. బాహ్య ఆచరణలు వాటి తరువాతనే.

హజ్రత్ ముతర్రఫ్ బిన్ అబ్దుల్లాహ్ (రహ్మ) ఎల్లప్పుడూ ఇలా ప్రార్థించేవారు: "ఓ అల్లాహ్! ఏదైనా మంచి పని కేవలం నీ ప్రసన్నత కొరకు మొదలు పెట్టి ఆ తరువాత నా సంకల్పంలో లోపం కలిగిన ప్రతీ దుష్ట సంకల్పం నుంచి నేను నీ శరణు వేడుకుంటున్నాను".

చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015

Geeturai Weekly
Account No:1042789768
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
IFSC Code. CBIN0282407
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar
Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com

సదఫ్ ఆఫ్రీన్

దేశ రాజకీయాల్లో మళ్లీ గూఢచర్యం ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. దేశంలో పెగాసస్ స్పైవేర్ దుమారం ఇంకా పూర్తిగా సద్దుమణగ లేదు. ఇప్పుడు టెక్‌ఫాగ్ అనే యాప్‌పై దుమారం రేగుతోంది. ఇది కూడా బీజేపీ పనేనని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

'టెక్‌ఫాగ్' అనే యాప్ సాయంతో భాజపా ఐటీ విభాగం సామాజిక మాధ్యమాలను హైజాక్ చేస్తోందని.. సొంత ఎజెండాను విస్తృతంగా ప్రచారం చేసుకుంటోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌరుల గోప్యతకు ఈ యాప్‌తో ముప్పు పొంచి ఉందని, దీంతో భారతీయ జనతా పార్టీ అనైతిక చర్యలకు పాల్పడుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో 20 నెలల వ్యవధిలో ది వైర్ వార్తాసంస్థ అద్భుతమైన పరిశోధన నిర్వహించింది. అసలేంటీ యాప్? దాన్ని ఉపయోగించి ఏం చేయొచ్చు? అనే వివరాలతో ఓ కథనాన్ని 'ది వైర్' వార్తా సంస్థ ప్రచురించింది.

ఏమిటీ ఈ టెక్‌ఫాగ్ యాప్!

బీజేపీ ఐటీ సెల్‌తో సంబంధాలు ఉన్న కొంతమంది వ్యక్తులు టెక్‌ఫాగ్ యాప్‌ను ఉపయోగించి ఇన్‌యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ ఖాతాల నియంత్రణ, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ట్రెడింగ్‌లో ఉన్న విషయాలను హైజాక్ చేస్తారు. బిజెపికి అనుబంధంగా ఉన్న రాజకీయ కార్యకర్తలు.. పార్టీ ప్రజాదరణ కృత్రిమంగా పెంచేందుకు దీనిని రహస్యంగా ఉపయోగిస్తున్నారు. ఈ యాప్‌లో బిజెపిపై విమర్శలు చేస్తున్న వారిని వేధించడం, ప్రజల అభిప్రాయాలను తారుమారు చేయడం వంటి చర్యలు చేపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తోంది. ఈ యాప్ పలు ప్లాట్‌ఫారమ్‌లో కథనాలను భారీగా మార్చడానికి, ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు చొచ్చుకుపోవడమే కాకుండా, సోషల్ మీడియా సందేశాలను భద్రపర్చడం వంటి సామర్థ్యాన్ని కల్గి ఉందని టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు.

టెక్‌ఫాగ్ ఎలా పని చేస్తుంది?

టెక్‌ఫాగ్ యాప్ సొంతంగా ట్విట్టర్, ఫేస్‌బుక్ ఖాతాలు క్రియేట్ చేస్తుంది. రీ ట్వీట్లు, ఫేస్‌బుక్‌లో పోస్టులను ఆటోమేటిక్‌గా షేర్ చేస్తుంది. ముందుగా టైప్ చేసి పెట్టిన సందేశాలతో ఆటోమేటిక్‌గా రిప్లైలు ఇస్తుంది. క్రియాశీలకంగా లేని వాట్సాప్ నంబర్లను హైజాక్ చేస్తుంది. టోకెన్ థెఫ్ట్ అనే సాంకేతికత ద్వారా ఆ నంబర్ల నుంచి సందేశాలు పంపిస్తుంది. క్రియాశీలకంగా లేని వాట్సాప్ నెంబర్లను టెక్‌ఫాగ్ యాప్ గుర్తిస్తుంది.

'టెక్‌ఫాగ్' ఓ ప్రైవేటు యాప్. అత్యాధునిక సాంకేతికతల సాయంతో దాన్ని రూపొందించారు. భాజపా ఐటీ విభాగానికి చెందిన అసంతృప్త ఉద్యోగిగా తనను తాను పేర్కొన్న ఓ వ్యక్తి.. 2020 ఏప్రిల్‌లోనే ఈ రహస్య యాప్ ఉనికిని ట్విట్టర్ వేదికగా

బయటపెట్టారు. తొలుత మీడియా ఫైల్ రూపంలో ఓ స్పైవేర్‌ను యాప్ నిర్వాహకులు గుట్టుగా పంపిస్తారు. దానిద్వారా ప్రైవేటు వ్యక్తులు ఫోన్లను పూర్తిగా తమ నియంత్రణలోకి తీసుకుంటారు.

దీని చేతుల్లోనే 'ట్రెండింగ్'

ట్విట్టర్‌లో 'ట్రెండింగ్' సెక్షన్‌ను, ఫేస్‌బుక్‌లో 'ట్రెండ్' విభాగాన్ని ఈ యాప్ ప్రభావితం చేస్తుంది. ఆయా వ్యక్తులు/బృందాలు చేసే ట్వీట్లను 'ఆటో రీ ట్వీట్', 'ఆటో షేర్' ఐచ్ఛికాల ద్వారా ఈ యాప్ నిర్వాహకులు వేగంగా రీ ట్వీట్ చేయొచ్చు. షేర్ చేయొచ్చు. తమ భావజాలాన్ని వాస్తవ తీరు కంటే ఎక్కువ వేగంగా వ్యాప్తి చెందించొచ్చు. ఫలితంగా ఏది నిజమో, ఏది కల్పితమో తెలుసుకోవడం ప్రజలకు కష్టమవుతుంది.

క్రియారహిత వాట్సప్ ఖాతాలతో...

ఒక ఫోన్ 'టెక్‌ఫాగ్' బారిన పడితే.. అందులోని వ్యక్తిగత సమాచారం, ఫోన్ నంబర్లు యాప్ నిర్వాహకుల చేతికి చిక్కినట్లే. ఆ ఫోన్ కాంటాక్ట్స్ జాబితాలోని నంబర్లలో ప్రధానంగా.. క్రియారహితంగా ఉన్న వాట్సప్ ఖాతాలను వారు హైజాక్ చేస్తారు. ఆ ఖాతాల నుంచి సందేశాలను వ్యాప్తి చెందిస్తారు.

ఈ యాప్‌కు విస్తృత క్లౌడ్ డేటాబేస్ ఉంది. అనేక మంది ప్రైవేటు వ్యక్తుల ఉద్యోగం/వృత్తి, మతం, మాతృభాష, వయసు, లింగం, రాజకీయ అభిప్రాయాల వంటి సమాచారమంతా విభాగాల వారీగా అందులో అందుబాటులో ఉన్నట్లు సమాచారం. వ్యక్తుల రంగు, శరీర కొలతల వివరాలూ ఉన్నట్లు తెలుస్తోంది. వీటి ఆధారంగా ఆయా గ్రూపులను నిర్వాహకులు లక్ష్యంగా చేసుకుంటారు. వేధింపులకు గురిచేస్తారు. కొంత మంది మహిళా విలేకరులను ఇలానే వేధించినట్లు తెలుస్తోంది.

దేశ భద్రతకు ముప్పు

'టెక్‌ఫాగ్'తో దేశ భద్రతకు ముప్పు పొంచి ఉందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రియెన్ పేర్కొన్నారు. వ్యక్తుల గోప్యత హక్కును అది హరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యాప్ విషయంపై చర్చించేందుకు పార్లమెంటరీ స్థాయీ సంఘం (హోం వ్యవహారాలు) వెంటనే భేటీ కావాలంటూ దాని ఛైర్మన్ ఆనంద్ శర్మ (కాంగ్రెస్)కు ఓబ్రియెన్ తాజాగా రెండోసారి లేఖ రాశారు.

ప్రముఖులపై నిఘా

దేశంలో పెగాసస్ స్పైవేర్‌తో ప్రముఖులపై నిఘా పెట్టిన అంశం గురించి పూర్తి స్థాయి వివరాలు బయటకు రాక ముందే మరో సంచలనాత్మకమైన యాప్ విషయంలో దుమారం ప్రారంభమైంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు విచారణ కావాలని ఎడిటర్స్ గిల్డ్ డిమాండ్ చేస్తోంది.

బీజేపీ మాత్రమే ఉపయోగిస్తోందా?

బీజేపీ ఐటీ సెల్ ఒక్కటే కాకుండా, భారతీయ జనతా యువ మోర్చా కూడా టెక్‌ఫాగ్ యాప్ వాడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్తి శర్మ పేరుతో ఒకరు బీజేపీ ఐటీ సెల్‌లో పని చేశానని చెబుతూ వివరాలన్నీ బయట పెట్టారు. తాను టెక్‌ఫాగ్ అనే యాప్‌ను వాడానని, ఇది సెక్యూరిటీ ఫీచర్స్‌ను దాటుకొని సందేశాలు పంపుతుందని, హ్యాష్‌ట్యాగ్‌లను ట్రెండ్ చేస్తుందని ఆర్తి శర్మ అనే ట్విట్టర్ అకౌంట్లలో తెలిపారు. 67 మంది యాప్ ఆపరేటర్లు ఎలా వాట్సాప్ నెంబర్ల నుంచి సందేశాలు పంపిస్తున్నారో ఆర్తి స్క్రీన్ షాట్లు పోస్ట్ చేశారు. దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీ లేదా సంస్థ ఈ టెక్ యాప్ వాడుతున్నట్లుగా స్పష్టత లేదు. కానీ బీజేపీపైనే తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

వంద రోజుల రీడింగ్ క్యాంపెయిన్

కరోనా ఎఫెక్ట్ వల్ల పుస్తకాలకు దూరమైన పిల్లలను మళ్లీ వాటికి దగ్గర చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సాయంతో సంక్రాంతి తర్వాత వంద రోజుల రీడింగ్ క్యాంపెయిన్ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. గత యేడు నెల రోజులు మాత్రమే పిల్లలకు ఫిజికల్ క్లాసులు. ఈ ఏడాదిలో సెప్టెంబర్ నుంచి క్లాసులు నిర్వహించినా అంతంత మాత్రంగానే పిల్లలు పాఠశాలలకు హాజరయ్యారు. సగానికి పైగా విద్యార్థులు కరోనా ఎఫెక్ట్ నుంచి ఇంకా కోలుకోలేదు. ఈ సమస్య కేవలం తెలంగాణలోనే కాక, అన్ని రాష్ట్రాల్లోనూ ఉంది. దీన్ని గమనించిన కేంద్ర విద్యా శాఖ అన్ని రాష్ట్రాలకు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది. డిసెంబర్ 9న రాష్ట్రానికి కేంద్ర విద్యాశాఖ లేఖ కూడా రాసింది.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర విద్యాశాఖ చర్యలు మొదలుపెట్టింది. దీంట్లో భాగంగా ఎస్‌సీఈఆర్‌టీ (SCERT) ప్రతినిధి ఎస్.వినాయక్‌ను రీడింగ్ క్యాంపెయిన్ సోడల్ ఆఫీసర్‌గా నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో వంద రోజుల రీడింగ్ క్యాంపెయిన్ను రీడ్ ఎంజాయ్ అండ్ డెవలప్మెంట్ READ (రీడ్) గా మార్చారు. ప్రతి రోజూ స్కూల్లో 8వ తరగతి వరకూ లైబ్రరీ పీరియడ్ పెట్టాలని నిర్ణయించారు. స్కూల్ లైబ్రరీల్లో కథల పుస్తకాలు, జీవిత చరిత్రలతో పాటు ఇతర ఇంట్రెస్టింగ్ బుక్స్ అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి వారం యాక్టివిటీ లిస్టును తయారు చేసి, దానికి అనుగుణంగా ముందుకుపోవాలని భావిస్తున్నారు. అయితే, ప్రస్తుతం కరోనా కేసులు ఎక్కువగా పెరుగుతుండటంతో, ఈ ప్రోగ్రాం ముందుకు పోతుందా అనే అనుమానం మొదలైంది. ఒకవేళ ఫిజికల్ క్లాసులు నిలిపివేస్తే, ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తే ఏం చేయాలనే దానిపై అధికారులు చర్చిస్తున్నారు. అయితే, ఎలాగైనా ఈ ప్రోగ్రాం మాత్రం కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

రుణాల ప్రకరణం

584) అబూ హురైరా (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ఉద్బోధించారు : "నేను ప్రతి విశ్వాసికి ఐహికంగా, పారలౌకికంగా అందరికన్నా ఎక్కువ సామీప్యం కలిగి ఉంటాను. మీరు కావాలనుకుంటే ఈ ఆయత్‌ని చదువుకోండి- 'నిస్సందేహంగా దైవప్రవక్త విశ్వాసులకు స్వయంగా వారి ఆత్మలకంటే కూడా సన్నిహితుడు' (అల్ అహ్‌జాబ్- 6). అందువల్ల ఏ విశ్వాసి అయినా చనిపోతూ ఆస్తిపాస్తులు వదలివెళితే, అతని వారసులు వాటికి యజమానులవుతారు. మరెవరయినా అప్పును వదలిపోతే లేదా సంతానాన్ని వదలిపోతే, వారు నా దగ్గరకు రావాలి. నేను వారి సంరక్షకుడను."[1]

అధ్యాయం : 12

ధనవంతుడై ఉండి కూడా దాటవేయటం అన్యాయం.[1]

585) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు: "ధనికుడైనవాడు (అప్పులు తీర్చే విషయంలో) దాటవేయటం అన్యాయం (జులుం, పాపం)."

అధ్యాయం : 13

తనకు హక్కు రావలసి ఉన్నవాడు సూటిగా అడగగలడు

ప్రవక్త మహనీయుల(సఅసం) ద్వారా ఈ విధంగా సెలవీయబడింది: "అప్పు తీర్చే స్థోమత ఉండి కూడా దాటవేసే వైఖరిని అవలంబిస్తే, అది అతని పరువు తీస్తుంది. అతన్ని శిక్షకు గురి చేస్తుంది. సుఫ్యాన్ సౌరీ ఇలా అన్నారు: పరువు తీయటం అంటే అర్థం, నువ్వు ఎప్పుడూ దాటవేస్తూ ఉంటావు అని అతనితో అనటం, శిక్షించటం అంటే అరెస్ట్ చేయించటం.

586) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం)ను అప్పు తీర్చమని అడగటానికి వచ్చాడు. ఆ సందర్భంగా అతను దురుసుగా మాట్లాడాడు. ప్రవక్త సహచరులు అతనికి దేహశుద్ధి చేయాలనుకున్నారు. కాని దైవప్రవక్త(స) తన సహచరులను వారిస్తూ "అతన్ని వదలండి. హక్కుదారునికి అలా మాట్లాడే హక్కుంది" అని చెప్పారు.

584-1. అంటే ప్రతి విశ్వాసికి తన ప్రాణాలంటే ఎంత తీపియో అంతకన్నా అధికంగానే దైవప్రవక్త (సఅసం)కు వారి పట్ల దయాభావం ఉంటుంది. ఎందుకంటే మనిషి పాపం చేసి, తిరస్కార(కుఫ్ర్) వైఖరికి ఒడిగట్టి తన ఆత్మకు అన్యాయం చేయగోరుతూ ఉంటాడు. కాగా, దైవప్రవక్త(స) అతనిని రక్షించగోరుతారు. అతనిని శాశ్వత సాఫల్యం వైపునకు తీసుకుపోవాలని కోరుకుంటారు.

12-1. అంటే రుణదాతలు వచ్చి రుణం తీర్చమని అడిగినప్పుడు రుణగ్రస్తుడైన ధనికుడు అకారణంగా వాయిదా వేయటం, తప్పించుకోవడానికి కుంటిసాకులు చెప్పటం ఎంత మాత్రం వాంఛనీయం కాదు. పైగా అది పాపంగా పరిగణించబడుతుంది. అలాంటి వ్యక్తి సాక్ష్యం స్వీకారయోగ్యం అవదని కూడా విద్వాంసులు అభిప్రాయపడుతున్నారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

40. అల్ మూ'మిన్

ప్రవేశిక

పేరు : 28వ ఆయత్‌లోని వాక్యం నుండి గ్రహించడం జరిగింది. అంటే ఆ ప్రత్యేక **"మూ'మిన్"** ప్రస్తావన వచ్చిన సూరా అన్నమాట.

అవతరణ కాలం: ఇబ్ను అబ్బాస్, జాబిర్ బిన్ జైద్ ప్రకారం, ఈ సూరా అజ్ జుమర్ సూరా తరువాత వెంటనే అవతరించింది. దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తుత క్రమం రీత్యా ఏ స్థానంలో ఉందో అవతరణా క్రమం ప్రకారం కూడా అదే స్థానం అన్నమాట.

అవతరణ పరిస్థితులు: ఈ సూరా అవతరించిన పరిస్థితులను గురించి దీని చర్చనీయాంశంలో స్పష్టంగా సూచించడం జరిగింది. మక్కా తిరస్కారులు ఆ సమయంలో ప్రవక్త మహనీయులకు వ్యతిరేకంగా రెండు విధాల కార్యకలాపాలలో నిమగ్నులయి ఉన్నారు. ఒకటి, అన్ని వైపులా వివాదాలు, తగాదాలు సృష్టించి, రకరకాల వక్ర ప్రశ్నలు లేవనెత్తి, అనునిత్యం కొంగ్రొత్త నిందలు మోపి ఖుర్ఆన్ బోధనలు, ఇస్లామ్ సందేశం, స్వయంగా ప్రవక్త మహనీయులను గురించి అసంఖ్యాకమయిన కుశంకలు, సందేహాలు, సంశయాలు జనుల హృదయాల్లో నాటాలన్నది; వాటికి వివరణలిస్తూ, సమాధానాలిస్తూ, కడకు ప్రవక్తశ్రీ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్), విశ్వాసులూ బేజారెత్తి పోవాలన్నది. రెండవది, ఆయన్ని (స) హతమార్చేందుకు వాతావరణాన్ని సానుకూలపరచాలన్నది. కాగా ఈ ఉద్దేశ్యంతోనే వారు నిరంతరం కుట్రలు పన్నుతూ ఉండేవారు. ఒకసారయితే ఆచరణాత్మకంగా వారు దీనికి చర్య కూడా తీసుకున్నారు. బుఖారీలో హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ ఉల్లేఖనం ఒకటి ఉంది. దాని ప్రకారం ప్రవక్త మహనీయులు (స) ఒకరోజున హరమ్ (కాబా పవిత్ర గృహం)లో నమాజ్ చేసుకుంటున్నారు. అకస్మాత్తుగా ఉక్బా బిన్ అబీ ముయైత్ ముందుకు వచ్చి ఆయన మెడచుట్టూ బట్టవేసి దాన్ని పెనవేయడం మొదలెట్టాడు, అలా ఆయన గొంతు నులిమి ఆయన్ని హతమార్చాలన్నది అతని ఇచ్ఛ. కాని సరిగ్గా అదే సమయాన అక్కడికి హజ్రత్ అబూబక్ర్ వచ్చేసి అతన్ని త్రోసివేశారు. హజ్రత్ అబ్దుల్లా ప్రకారం, ఆ దుర్మార్గునితో అబూబక్ర్ సిద్దీక్ సంఘర్షిస్తూ ఉన్నప్పుడు ఆయన నోటి నుండి ఈ పదాలు వెలువడ్డాయి, "మీరు ఒక వ్యక్తి నా ప్రభువు అల్లాహ్ అని ప్రకటించినంత మాత్రానే అతన్ని చంపివేస్తారా?" కొంత తేడాతో ఈ సంఘటన ఇబ్ను హిష్షామ్ వ్రాసిన ప్రవక్తశ్రీ (స) చరిత్రలోనూ ఉటంకించబడింది. నసాయి, ఇబ్ను అబీ హాతిమ్ కూడా దీన్ని ఉల్లేఖించారు.

ప్రధాన విషయం, చర్చనీయాంశాలు: పరిస్థితుల ఈ రెండు కోణాలను ప్రసంగం ప్రారంభంలోనే విశదంగా చెప్పడం జరిగింది. ఇంకా ముమ్ముందు ప్రసంగమంతా ఈ రెండు కోణాలపైనే అత్యంత ప్రభావవంతమయిన, గుణపాఠం గరిపే సమీక్ష సాగింది.

హత్యకై జరిగే కుట్రలకు సమాధానంగా ఫిర్‌ఔన్ ప్రజల్లోని విశ్వాసికి సంబంధించిన గాథ వినిపించబడింది (23 నుండి 55వ ఆయత్ వరకు). ఈ గాథ రూపంలో మూడు వర్గాలకు మూడు విభిన్నమయిన గుణపాఠాలు గరపడం జరిగింది:

(మిగతా భాగం వచ్చే సంచికలో)



దైవ గృహం కాబా పునర్నిర్మాణం

- ఎస్.ఎమ్. మలిక్

కాబా- పుడమిలో ప్రప్రథమ ఏకైక దైవగృహాన్ని, ఏకోన్ముఖుడయిన త్యాగశీలి, దైవమిత్ర, మహనీయ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) దైవాజ్ఞ మేరకు కొన్ని కొండల నడుమ, నీటి చుక్కలేని, గడ్డిపరకా మొలవని ఎడారి భూభాగాన తన జేష్ఠ పుత్రుణ్ణి, పాలు త్రాగే శిశువును, అతని తల్లిని వదలినచోట, ఆ శిశువు, దైవాజ్ఞా బద్ధుడు, దైవవిధేయుడు, ప్రాణత్యాగ సన్నద్ధుడు, ఇస్మాయీల్ (అలైహిస్సలామ్)ని పెంచి పోషించిన ప్రదేశంలో, ఆ నిర్జల, నిర్జన, హరితరహిత క్షేత్రమే ఆ తండ్రి ప్రార్థనలకు బదులుగా కొన్నేండ్ల ల్లోనే దైవం అనుగ్రహించిన నీటి ఫలంగా, కళకళలాడే జనావాసమయి, మక్కా అనే నగరంగా మారగా తన ఆ జేష్ఠ కుమారునితో కలసి అక్కడే నిర్మించారన్నది జగద్విదిత సత్యం.

అత్యంత పురాతన దైవ గృహం

రెండున్నర సహస్రాబ్దుల కాలం సాధారణ విషయం కాదు, మహనీయ ఇస్మాయీల్ వంశం ఎన్ని శాఖోపశాఖలుగా, ఎంత విశాలంగా విస్తరించిందో, ఎన్ని తరాలు గతించాయో ఆయన్ని జనం అబుల్ అరబ్ అని పిలువసాగారు! ఆ వంశంలోనే ఆ తండ్రి ఇబ్రాహీమ్(అ), తనయుడు ఇస్మాయీల్(అ) ప్రార్థనల ఫలంగా అప్పటికి ప్రకాశమానంగా వెలిగే మహాదీపం (సిరాజుమ్ము నీరా), ముహమ్మద్(స) జన్మించారు ఆ మహానగరం, మక్కా పుణ్యపురిలో. అదే కాబా కట్టడం ఆ నాటికి పాతబడిపోయింది. వరదల వల్ల శిథిలం కాలేదు కాని శిథిలావస్థకు చేరిందని భావించారు పురజనుల నాయకులు. పైగా అది ఎత్తయిన కట్టడం కాదు. మనిషి ఎత్తుకన్నా కాస్త ఎత్తు, కప్పు లేదు. దాని ద్వారమూ నేల స్థాయిలోనే ఉండేది. ఎవరయినా కాస్త ప్రయత్నించి గోడ ఎక్కి లోనికి చొరబడి దొంగతనమూ చెయ్యగలరు. ఓ బానిస వ్యక్తి దువైక్ అనే వాని వద్ద కాబాలోని సొత్తు దొరకడం వల్ల అతనికి శిక్ష కూడా పడింది. ఈ కారణాల వల్ల కురైష్ నాయకులు కట్టడాన్ని కాస్త దృఢంగా, ఎత్తుగా కట్టి పైన కప్పు కూడా వేయాలని సంకల్పించుకున్నారు.

వారి అభీష్టానికి తగినట్లుగా ఒక రోమను వాణిజ్యవేత్త ఓడ, జిద్దా ఓడరేవుకు తుఫాను ధాటికి వచ్చి బ్రద్దలయింది. ఇది విన్న కురైష్ నాయకులు దాని కలప తమకు కావలసినంత కొనుక్కున్నారు.

వారికి ఓ రోమను మేస్త్రీ కూడా అక్కడ జిద్దాలో దొరికాడు. అతన్ని వారు మాటలాడి పిలుచుకువచ్చారు. అలాగే ఓ ఈజిప్ట్‌కు చెందిన వడ్రంగి కూడా మక్కాలో ఉన్నాడు. ఇవన్నీ సమకూరడం దైవికంగా జరిగిందని వారు భావించారు. అయితే కాబాను పునర్నిర్మించడ మంటే ముందుగా దాన్ని పడగొట్టాలి. ఎన్ని వరదలు వచ్చినా ఎంత కాలం గడిచినా పడిపోని దైవగృహాన్ని చేతులారా పడగొట్టడ మంటే ఎవరూ సాహసించలేకపోతున్నారు. దైవప్రవక్త తండ్రి అబ్దుల్లాకు మామ వరుస అయిన ఓ వ్యక్తి నిలబడి కాబా గోడ నుంచి ఓ రాయి తీసి మళ్ళీ దాని స్థానంలో పెట్టేశాడు. ఆ తరువాత అతను ఇలా ప్రకటించాడు, "కురైష్ జనులారా, ఈ నిర్మాణంలో మీరు మీ ధర్మ సంపాదనను వెచ్చించండి, వడ్డీ ధనాన్నీ మరో అధర్మ సంపాదనను, అన్యాయంగా ఆర్జించిన సొమ్మును ఖర్చుపెట్టకండి."

ఆ తరువాత ధైర్యం చేసి వలీద్ బిన్ ముగీరా కాబా కట్టడాన్ని పడగొట్టడానికి కుద్దలి చేతబూని ఇలా మొరపెట్టుకున్నాడు, "దైవమా! మేము ధర్మానికి విముఖులము కాలేదు, మేలును తప్ప మేము మరి దేన్నీ కోరుకోవడం లేదు." అంటే మరే చెడు సంకల్పంతోనూ నీ గృహాన్ని పడగొట్టడం లేదు, ఇలా పలికి కాబా గోడపై ఓ దెబ్బ వేశాడు, ఆ పైన ఆగిపోయాడు. రాత్రంతా అందరూ వేచి చూశారు, వలీద్‌కు ఏదయినా ముప్పు మూడు తుందేమోనని. ఒకవేళ ఏదయినా విపత్తు వస్తే ఆగిపోవాలని, అలా కాకపోతే పని కొనసాగనివ్వాలని. మరుసటి రోజు వలీద్‌కు ఎటువంటి హాని జరగకపోవడంతో పలు తెగలవారు కట్టడాన్ని పడగొట్టే బాధ్యత పంచుకుని పడగొట్టసాగారు. అలా వారు మహనీయ ఇబ్రాహీమ్(అ) వేసిన పునాదుల వరకు గోడలన్నీ పడగొట్టి మరిన్ని రాళ్ళు సేకరించి దైవగృహ పునర్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనసాగారు. అయితే ఈ నవ నిర్మాణంలో సామగ్రి కొరవడటం వల్ల తొలినాటి ఇబ్రాహీమ్(అ) పునాదుల్ని కొంతమేర వదలివేయవలసి వచ్చింది. అయితే ఆ మేరకు చిన్నపాటి గోడకట్టి ప్రస్తుత దైవగృహానికి వెలుపల దాన్ని కాబా గృహంలో భాగమే అని సూచించడానికి వదలివేయడం జరిగింది. దాన్ని 'హతీమ్' అనీ 'హిజ్ర్' అనీ అంటారు.

వివేచనా కౌశల్యం!

కాబా నిర్మాణం జరుగుతూ ఉండగా కాబా గృహం తూర్పు మూలన హజ్రె అల్ అస్వద్ (నల్లనిరాయి) అమర్చవలసిన దశ వచ్చినప్పుడు అన్ని తెగలూ తమలో తాము వాదులాడుకో సాగాయి, ఆ వాదులాట జగడం, పోరు వరకు కొనసాగింది. అందరూ కత్తులు దూసారు! ప్రతి తెగ దాన్ని అమర్చే గౌరవం, ప్రతిష్ఠ, మహత్తు తమకే దక్కాలని కోరుకునేది. అయిదు రోజుల తరువాత ఆ జగడం ఓ తీర్మానానికి వచ్చింది. వారంతా ఓ రోజు దైవగృహ ప్రాంగణంలో సమావేశమయి సలహా సంప్రతింపులు జరుపుకున్నారు. అనేక ప్రతిపాదనల తరువాత అబూ ఉమయ్యా బిన్ ముగీరా (వలీద్ బిన్ ముగీరా అన్న), వారిలో అందరికన్నా వయసు మీరిన వ్యక్తి ఒక సలహా ఇచ్చారు, "ఓ మాటను మన మందరం అంగీకరిద్దాము, ఇక ఏ వ్యక్తి అయితే దైవగృహ ప్రాంగణ ద్వారం (బనీ షైబా ద్వారం) ద్వారా ప్రథమంగా లోనికి ప్రవేశిస్తారో అతని తీర్పును మనమందరం శిరసావహించాలి." ఈ ప్రతిపాదన రాగానే అందరూ సరేనని ఒప్పుకున్నారు. ఇక అందరూ కళ్ళప్పగించి బనీ షైబా ద్వారాన్నే తిలకిస్తూ ఉన్నారు!!

దైవికంగా జరిగిందేమిటంటే ఆ తరువాత ప్రప్రథమంగా ప్రవేశించినవారు మహనీయ ముహమ్మద్(స)! ఆయన్ని చూడగానే జనం ఎలుగెత్తి పలికారు, "ఈయనయితే అమీన్ (నిజాయితీ పరుడు), మాకు సమ్మతమే, ఈయన ముహమ్మద్!"

వెంటనే కొందరు వెళ్ళి ఆయనకు జరిగిన విషయమంతా చెప్పి "ఇక మీరే దీనికి ఓ పరిష్కారం చూపాలి" అని సమస్య ముందుం చారు. ఆయన(స) ఒక్క నిముషంలో "ఓ పెద్ద దుప్పటి తీసుకు రండి" అని కోరారు. దుప్పటి రాగానే దాన్ని పరచి మధ్యన హజ్రె అల్ అస్వద్‌ని ఉంచారు. ఆ తరువాత, "ఇక ప్రతి తెగవారు దుప్పటిని నలువైపులా పట్టుకుని ఆ రాయిని లేపండి" అని నిర్దేశించారు. ఆపైన అందరూ లేపి దాన్ని అమర్చవలసిన స్థాయికి చేర్చగానే తన స్వహస్తాలతో గోడలో దాన్ని అమర్చి వేశారు. అప్పుడు ఆయన వయసు 35 సంవత్సరాలు. దైవదౌత్యానికి అయిదేళ్ళు ముందు! జాతి మొత్తం కళ్ళారా చూసుకుంది, ఆయన జాతిని అంతర్యుద్ధం బారి నుండి ఎలా కాపాడారో, తన బుద్ధి కుశలతతో ఎంత చాకచక్యంగా, పెద్ద తలలన్నీ తలలు బద్దలు చేసుకుని కూడా పరిష్కరించుకోలేకపోయిన ప్రమాదకరమయిన వివాదాన్ని ఉత్తమరీతిలో, నిముషాల్లో అతి సునాయాసంగా ఎలా చక్కబెట్టారో!!

ఉల్లేఖనాల ప్రకారం, ఈ ఒక్క సందర్భంలోనే కాదు, కురైష్ తెగలో తలెత్తిన వ్యక్తిగత సామూహిక అనేక తగాదాలను దైవ దౌత్యానికి పూర్వం తీర్పు కొరకు ఆయన వద్దకు తీసుకువచ్చేవారు, ఆయన ఎంతో న్యాయబుద్ధితో, అందరూ మెచ్చుకునే విధంగా వాటిని నేర్పుగా చక్కదిద్దేవారు!

ఆధారం : *1) సీరతున్నబీ కామిల్, ఇబ్నుహిషామ్ : సం.1, పు. 216-220*
2) సీరతె సర్వరె ఆలమ్, సం.2; పు.98,99

బేటీ బచావో, బేటీ పడావో అంటున్న దేశంలో బేటీ బేచో అనే నేరానికి కొందరు ఒడిగడుతున్నారు. కొత్త కొత్త యాప్‌లు సృష్టించి దాదాపు గత రెండేళ్ళుగా ముస్లిం సమాజానికి చెందిన విద్యాధికులు, మేధావులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు అలాగే వివిధ రంగాలకు చెందిన ప్రముఖ మహిళలు, యువతుల ఫోటో లను వివిధ అనైతిక పద్ధతుల ద్వారా సేకరించి వాటిని మార్ఫింగ్ చేసి సంబంధిత మహిళలకు తెలియకుండానే రేటింగ్ జేస్తూ బహిర్గతంగా బజారులో వేలంపాట పెట్టడం నైతిక దివాళాకోరు తనానికి సజీవ సాక్ష్యం. ఈ అనాగరిక చేష్టలు ఆన్‌లైన్‌లో లిబ్రల్ డోగ్ అనే యాప్ ద్వారా దాదాపు రెండేళ్ళ క్రితం వెలుగులో కొచ్చాయి. దీనిపై వివిధ సంస్థలు తీవ్ర స్థాయి నిరసనలు వెలిబుచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఐటీ శాఖ మొదట్లో ఏ మాత్రం పట్టించుకోలేదు. తత్ఫలితంగా సైబర్ నేరస్తులు మరీ రెచ్చిపోయి సుల్లీ డీల్స్ అనే యాప్‌తో ఇదే తంతు కొనసాగించారు. అయినా మన కేంద్ర ప్రభుత్వం మౌన ప్రదర్శన వీడలేదు గనక ఈ వ్యవహారం బుల్లీ బాయి యాప్ దాకా చేరుకొని పరాకాష్ట చెందింది. దీనిద్వారా గౌరవప్రదమైన జీవితం గడుపుతున్న వందలాది ముస్లిం మహిళలను కించపరిచారు. వారి మాన మర్యాదలకు భంగం కలిగింది, దీనికి ఎవరు బాధ్యులు?

జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేఖా శర్మ, శివసేన ఎం.పీ. ప్రియాంకా చౌదరిలాంటి వాళ్ళు వెంట బడితేగాని నేటికి అతికష్టంగా ఐదుగురు పట్టుపడ్డారు. అందులో నలుగురు షేర్ చేసినోళ్ళే, ఒకతని మీద బుల్లీ యాప్ సృష్టించినట్టు అనుమానం ఉందన్నారు. వాళ్ళ వివరాలు చూస్తే మనకు ఆశ్చర్యం కలుగక మానదు. ఎందుకంటే, అందరూ పిన్న వయస్కులే. శ్వేతాసింగ్‌కు 18 ఏళ్ళు, విశాల్ కుమార్ ఝాకు 21 ఏళ్ళు, మయాంక్ రావత్‌కు 21 ఏళ్ళు, నీరజ్ భిన్ నోయికి 21 ఏళ్ళు, ఉమాకేశ్వర ఠాకూర్‌కు 26 ఏళ్ళు, ఇతనే బుల్లీబాయి యాప్ సృష్టించాడని అనుమానించడం జరుగుతోంది. దాదాపుగా వీళ్ళందరూ ఇంజినీరింగ్ విద్యార్థులే, వీళ్ళందరిది పేద కుటుంబ నేపథ్యమే. ఇదంతా చూస్తుంటే ఏం అవగతమవుతుందంటే, అసలు నేరస్తులను పట్టుకోకుండా వీళ్ళను బలి పశువులుగా చేయడం జరుగుతుందేమో అని. మరి వీళ్ళంతా వెనకబడిన రాష్ట్రాలకు చెందినోళ్ళు కూడా. ఒకరు బీహారుకు చెందినవాడైతే మరొకరు ఝార్ఖండ్, ఇంకొకరు అస్సాం.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే 2020 సంవత్సరంలో దాదాపు 10,400 మహిళా సంబంధిత సైబర్ నేరాలు చోటు చేసుకున్నాయి. కాని మన కేంద్ర ప్రభుత్వం వాటిపై చర్య తీసుకున్న దాఖలాలు ఏమీ లేవు.

ట్రోలింగ్ చేసే ఈ దుర్మార్గపు మూకలు మన దివంగత విదేశాంగ మాజీ మంత్రి సుష్మా స్వరాజ్‌ను కూడా వదల్లేదు. ఆమె కులాంతర వివాహం జేసుకున్న ఓ జంటకు పాస్‌పోర్ట్ తీసుకోవడంలో సహకరించినందుకు, ఈ మూకలు ఆమెను కూడా ట్రోల్ చేసాయి. అలాగే ప్రముఖ క్రీడాకారుడు విరాట్ కోహ్లీని కూడా వదల్లేదు. ఓ ప్రబుద్ధుడు పాలు తాగే ప్రాయంలో ఉన్న అతని బిడ్డను మానభంగం చేస్తానని బెదిరించడం జరిగింది. ఇంతకుమించి మూర్ఖత్వం మరొకటి ఉంటుందా? వీటన్నిటికీ మించి కార్గిల్ యుద్ధంలో పోరాడి అమరగతి చెందిన ఓ వీర సైనికుని అమ్మాయిని కూడా రేప్ చేస్తానని ఓ అనాగరికుడు బెదిరించడం జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే, బోలెడు సంఘటనలున్నాయి.

ఇలాంటి విద్వేష సర్పాలను పెంచి పోషించే బదులు, ప్రేమానురాగాల పావురాలను పెంచి పోషిద్దాం. విద్వేషపూరిత వాతావరణానికి చరమగీతం పాడి ప్రేమానురాగాల వసంతాన్ని స్వాగతిద్దాం. దేశాన్ని, జాతిని స్వార్థ పర రాజకీయాలకు బలిపశువులు కాకుండా కాపాడుకుందాం. మన దేశాన్ని ప్రపంచ పటంలో ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలబెడదాం. సంకుచిత భావాల సంకెళ్ళను తృంచుదాం. సుహృద్భావనలను వ్యాపింపజేద్దాము.

అల్లాహ్ ఒక్కడే సత్యదేవుడని, దైవత్వంలో ఆయనకెవరూ సాటిలేరని దైవత్వం ఆయనకే అంకితమని, భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు ఎవరూ లేరని, ఆయన ఎవరినీ కనలేదని, ఆయన్ని ఎవరూ కనలేదనే విశ్వాసాన్నే 'కలిమ యె తౌహీద్' అంటారు. దైవ ఏకత్వం పట్ల విశ్వాసం కలిగి ఉండటమే ఇస్లాం ధర్మం తెలిపిన మొట్టమొదటి మూలాంశం. అల్లాహ్‌కు సంతానం ఉంటుందనే వాదనను ఖండిస్తూ దివ్య ఖుర్ఆన్ "ఉజైర్ అల్లాహ్ కుమారుడు అని యూదులు అంటారు. మసీహ్ అల్లాహ్ కుమారుడు అని క్రైస్తవులు అంటారు. వారికి పూర్వం అవిశ్వాసంలో పడి ఉన్న వారి మాటలను అనుకరిస్తూ వారు తమ నోటితో అనే ఈ మాటలు నిరాధారమైనవి" అని హెచ్చరిస్తుంది. విశ్వసించిన ఆ ఏకేశ్వరుణ్ణి ఆరాధిస్తాం. ఆరాధన మరొక అర్థం విధేయత, పూజించటం. విశ్వసించిన ప్రజలను సంబోధిస్తూ ఆఖరి ఆకాశ గ్రంథంలో, "ఈ రేయింబవళ్ళు, ఈ సూర్యచంద్రులు అల్లాహ్ సూచనలలోనివే. సూర్యచంద్రులకు సాష్టాంగపడకండి. వాటిని సృజించిన దేవునికి సాష్టాంగపడండి. నిజంగానే మీరు ఆయనను ఆరాధించేవారు అయితే" అని వివరించటం జరిగింది. అంతేకాదు మనోవాంఛను తన దేవుడుగా చేసుకున్న వ్యక్తి స్థితిని ఎప్పుడైనా నీవు గమనించావా? (అల్ ఫుర్కాన్: 43) అని ప్రశ్నించటం జరిగింది. అంటే మనోవాంఛలకు లోబడి, మనోకాంక్షల విధేయతను పాటించడం విశ్వాస రాహిత్యం, పాపకార్యంగా బోధించటం జరిగింది. అంతేకాదు, "అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యనివారే దుర్మార్గులు" (అల్‌మాయిదా : 45) అని తీవ్రమైన హెచ్చరిక చెయ్యటం జరిగింది. అల్లాహ్ పట్ల విశ్వాసం ఉండటం వలన వెర్రి నమ్మకాలు, భ్రమలు, మూఢవిశ్వాసాలు, మనోకల్పిత భయాలన్నీ అంతమై శారీరక, మానసిక స్వచ్ఛత లభిస్తుంది. తద్వారా మానవునికి ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం తెలుస్తుంది. మేము మనిషిని అతి సుందర రూపంలో సృష్టించాము, మేము మానవులకు అత్యంత గౌరవం ప్రసాదించాము అనే దైవవాణి బోధన అర్థమవుతుంది. "మానవులందరూ ఒకే జంట సంతానం" అనే దివ్య ఖుర్ఆన్ సంబోధనా భాగ్యం మూలంగా సమాజం నుండి జాతి, కుల భేదాలు, బానిసత్వం, దౌర్జన్యం, హీనపర్చటం, అసహ్యించుకుకోవటం

మిగతా 34వ పేజీలో...



మానవ జీవితానికి సంబంధించిన సమస్యలు అనేకం. కూడు, గూడు, గుడ్డ లాంటి మౌలిక సమస్యలతోపాటు విద్యాబుద్ధులు, సంఘం, సంస్కృతి, యుద్ధం, సంధి సమస్యలు- ధన, మాన, ప్రాణ రక్షణకు సంబంధించిన సమస్యలు- ఇలా ఎన్నో సమస్యలతో మనిషి సతమతమవుతున్నాడు. మనిషికి ఎదురయి ఉన్న ఈ సమస్యల పరిధి ఒక్కోసారి వ్యక్తికి పరిమితమయితే, ఒక్కోసారి కుటుంబానికి, సమాజానికి, దేశానికి విస్తరించి ఉంటాయి. సమస్యలు అవి ఏ రంగంతో ముడిపడి ఉన్నా వాటిని మూడు శీర్షికల్లో విభజించవచ్చు.

1) సిద్ధాంతాలు

2) సామాజిక సంబంధాలు

3) సంస్కృతీ - శిక్షాస్మృతీ (చట్టం)

మనం, మన నిజదైవాన్ని గ్రహించి, ఆయన ఆదేశాలకను గుణంగా నడుచుకుంటే ఈ మూడు శీర్షికల్లో విభజితమయి ఉన్న మానవ సమస్యలు పరిష్కారం అవుతాయా? అన్న ప్రశ్నకు సమాధానమే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం!

మహా ప్రవక్త ముహమ్మద్ (స) అంతిమ దైవ ప్రవక్తగా ప్రభవించిన నాటికి లోకంలో అక్కడక్కడా సత్య కాంతి మిణుకుమిణుకుమని కానవచ్చినా అధికాంశం అంధకారమయం. జ్ఞానానికి మూలమయిన అక్షరం అప్పుడప్పుడు తళుక్కుమనే నక్షత్రం! మూఢ నమ్మకాల దొంతరలు, సామాజిక అవగాహనకు సూత్రం, "గళం గలవాడిదే బలం, బలం గలవాడిదే సుఖం, సుఖం గలవాడిదే అధికారం" అన్నది. సమాజం తరగతుల్లో విభాజితం: పాలకులు, స్వాములు, నాయకులు. కర్షకులు, దాసులు, బానిసలు, నౌకరులు అధమాతి అధములు! కులం, వంశం, వర్గం, వర్ణం, తెగ, పగ, కక్ష, వివక్ష సమాజంలో ప్రధాన పాత్రా ధారులు, గుణం, సంస్కారం, సభ్యత, నాగరికత, నీతి, నిజాయితీ లకు అక్కడక్కడా కడపటి స్థానం. ఆ చీకటి ఎడారిలో విరిసింది వెలుగొందే ఒక రోజా. దాని ఘుమఘుమలే నేటికీ జన వనంలో ఆశల తెరలను నింపుతున్నాయి. ఆ పుష్పరాజం నోట వెలువడిన సూత్రం: "ఖూలూ లా ఇలాహ ఇల్లల్లాహ్ తుఫ్‌లిహూ". మీరు అల్లాహ్ తప్ప ఆరాధ్యులు ఎవరూ లేరు అన్న పరమ సత్యాన్ని త్రికరణ శుద్ధితో స్వీకరించండి, ఇహపర సాఫల్యాలు మీ చిరునామ తెలుసుకొని మరీ వచ్చి మీ ముంగిట వాలుతాయి. మీ సకల సమస్యలు తీరతాయి. ఏ సద్వచనం కారణంగా సకల సమస్యలు తీరతాయని ప్రవక్త(స) చెప్పారో ఆ సద్వచనం గురించి సర్వేశ్వరుడయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో". ఏమిటి, 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని నోటితో ఉచ్చరించడం వల్ల, మనసుతో అంగీకరించడం వల్ల, అది విధించే పరిధులకు లోబడి జీవించడం వల్ల మానవ- మన సమస్యలు పరిష్కారం అవుతాయా? అది ఎలాగో తెలుసుకుందాం!

1) సిద్ధాంతాలు

మనిషి పుట్టగానే ఒక ప్రత్యేక వాతావరణాన్ని గమనిస్తాడు. ఇక్కడ సూర్య చంద్రాదుల ఉదయం, అస్తమయం జరుగుతున్నది. పగలు వస్తుంది, రేయి పోతుంది. నింగిలోని తారకలు తళుక్కున మెరుస్తాయి, పుసుక్కున మాయమైపోతాయి. నేల సస్యశ్యామలంగా కళకళలాడుతుంది. ఎండి వెలవెలబోతుంది. నీరు యేరయి గలగల పారుతుంది, ఎండి పోతుంది కూడా. సృష్టిలో నిరంతరం జరిగే ఈ మార్పులు ఇట్టే దాటి పోవు. మనిషి దేహం పైనే కాకుండా ఆత్మపైనా, ఆలోచనపైన సయితం ప్రభావం చూపుతాయి. ఉదయం ఉపాధి ఆధారమయితే, రాత్రి విశ్రాంతికి మూలం. మనిషి చుట్టూ జరిగే ఈ మార్పులు అతనికి సంతోషాన్ని, సుఖాన్నీ ఇస్తాయి. దుఃఖానికి, కష్టానికీ గురిచేస్తాయి. వీటి ద్వారా మనిషి ఆరోగ్యాన్ని పొందుతాడు, అనారోగ్యం పాలూ అవుతాడు. ఒక్కోసారి అతనికనిపిస్తుంది తన ఆదేశం, అధికారం- భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పు చివరికి తన దేహం మీద సయితం లేదు అని. ఈ భావన కలగగానే ప్రపంచంలో తనకి లాభనష్టాన్ని కలుగజేసే ప్రతి వస్తువు అతన్ని భయపెడుతుంది. ఫలితంగా మనిషి అవనిని పూజించడం ప్రారంభించాడు, అందులో ఎనలేని నిధులూ నిక్షేపాలు ఉన్నాయని. ఆకాశాన్ని దేవతగా భావించాడు, అది వరాల జల్లు కురిపిస్తుందని. పర్వతాల ముందు తల వంచాడు, అవి తన కన్నా ఎంతో ఎత్తయినవనీ. సముద్రాలంటే ఆపాద మస్తకం వణికిపోయాడు, దాని పొగరుమోతు (సునామీ లాంటి) కెరటాలు తనను నాశనం చెస్తాయేమోననీ. అన్నింటిని పూజించడం ఆరంభించాడు. దేవుడున్నాడని నమ్ముతూనే పుణ్య పురుషులను, సంఘసంస్కర్తలను దైవానికి సాటి చేసి కొలవ నారంభించాడు. మనిషిగా పుట్టించి సృష్టిరాసుల్లోనే శ్రేష్ఠస్థానాన్ని దేవుడు తనకిస్తే, తన అసమర్థతతో అధఃపాతాళానికి దిగజారాడు మనిషి. ఈ యదార్థాన్ని ఖుర్ఆన్ ఇలా అభివర్ణిస్తుంది:

"నిశ్చయంగా మేము మానవుణ్ణి అత్యుత్తమమయిన ఆకృతిలో సృజించాము. అటుపిమ్మట అతన్ని (అతని నిర్వాకాలకు బదులుగా) అధమాతి అధమ స్థానానికి మళ్ళించాము". (అత్తీన్: 4,5)

అతనిలో చోటుచేసుకున్న భయాలన్నీ అతను మనస్ఫూర్తిగా సంకల్పించుకుంటే ఒక్క సత్యంతో పటాపంచలు కాగలవు. కానీ, అతను ఆ సత్యాన్ని గ్రహించే ప్రయత్నం చేయలేదు. చేసి ఉంటే, ఈ విశ్వ వ్యవస్థను నడుపుతున్నది ఒకే ఒక్క సృష్టికర్త అని, విశ్వం మొత్తం ఆ నిజ స్వామికే తలొగ్గి మనుగడ కొనసాగిస్తుందని తెలుసుకునేవాడు. ఆ ఒక్క నిజ అధికారికి మాత్రమే భయపడేవాడు. ఆ సత్య ప్రభువు పట్ల వాస్తవమయిన భక్తి అతన్ని సకల భయాల నుండి ముక్తి కలిగించేది. ఆ కృపా సాగరుని దాస్యం సకల దాస్య శృంఖలాలను త్రెంచేసేది. జ్ఞానోదయం కలిగిన అతను గొంతెత్తి ఇలా చాటేవాడు: నేను నింగిలో మెరిసే తారకల్ని చూశాను. అవి కొంత కాలం ఉంటాయి తర్వాత నిష్క్రమిస్తాయి. నేను పండు వెన్నెల్ని పంచే ప్రకాశ మానమయిన చంద్రుణ్ణి చూశాను. అదీ కనుమరుగవుతుంది. నేను బ్రహ్మాండంగా వెలిగిపోతున్న సూర్యుణ్ణి చూశాను, అదీ ఓ సమయం తర్వాత అస్తమిస్తుంది. ఇలా ఒక సమయం నుండి మరో సమయం వరకూ వచ్చీపోయేవేవి దైవం కాలేవు, వాటిని నియమానుగుణంగా నడిపిస్తున్న ఆ సర్వశక్తిమంతుడే నా ఉపాసనా రీతులన్నింటికీ అర్హుడు.

"నిశ్చయంగా నేను భూమి, ఆకాశాలను పుట్టించినవాని వైపునకు ఏకాగ్రతతో నా ముఖాన్ని త్రిప్పుకుంటున్నాను. నేను బహు దైవారాధకుల్లోని వాడనుకాను". (అన్ఆమ్: 79)

అంటే, మనిషిలోని మతపరమయిన, విశ్వాసపరమయిన భ్రమ, భ్రాంతులన్నింటినీ 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులు ఎవరూ లేరు అన్న సద్వచనం తొలగించి, అతనికి క్రాంత దృష్టిని, శాంత స్వభావాన్ని ఇస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మతపరమయిన సకల రుగ్మతలకు, దురాచారాలకు, నూతన పోకడలకు విరుగుడు 'లా ఇలాహ ఇల్లల్లాహ్'!

ఇదో మానవ జీవితానికి సంబంధించిన కోణమయితే, మరో కోణంలో మనిషి సృష్టిలో జరిగే ఈ మార్పుల గురించి తెలుసుకున్నాడు. ఏదో అదృశ్య శక్తి ఆదేశం మేరకు నిప్పు మండుతుందని, నీరు ప్రవహిస్తుందనీ, నేల ధాన్యం పండిస్తుందనీ, సుభిక్షమయినా, దుర్భిక్షమయినా, కలిమి అయినా, లేమి అయినా, జననం అయినా, మరణం అయినా ప్రతిదీ ఆ అదృశ్య శక్తి ఆజ్ఞకే కట్టుబడి ఉన్నాయని గ్రహించాడు. మనిషిలో పరిశోధించాలన్న ఆలోచన మొగ్గ తొడిగింది, అతని అన్వేషణ మొదలయింది. ఆ శక్తి ఏమిటో, ఎలా ఉంటుందో తెలుసుకోవాలని పరితపించాడు. ఆ శక్తిని తాను చూడలేడుగాని ఆ విశ్వకర్త శక్తి సంబంధించిన నిదర్శనాలు అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. మనిషి తనకున్న పరిమిత జ్ఞానంతోనే తర్కించడం మొదలెట్టాడు. నా కళ్లకు కనబడని, నా వీనులకు వినబడని, నా పంచేంద్రియాల పరిధిలోకి రాని ఒక వస్తువును నేనెందుకు నమ్మాలి. పురోగమనానికి బదులు తిరోగమనం చోటు చేసుకుంది. ఈ విశ్వంలో ఎవరి పరిపాలన సాగుతుందో తెలియనప్పుడు ఆ శక్తిని అంగీకరించి ప్రయోజనం

ఏమిటి? అతను గ్రహించాడు, విశ్వంలో కొన్ని సాధనాలు కలిసినప్పుడు కొన్ని ప్రత్యేక సంఘటనలు జరుగుతాయి. నిప్పు కాల్చుతుంది. నీరు వల్ల మొక్కల్లో ప్రాణం వస్తుంది. విషం మనిషిని చంపు తుంది. అమృతం మనిషిని బ్రతికిస్తుంది. ఇలా ఎందుకు జరుగు తుంది? అతనో నిర్ణయానికి వచ్చాడు. తాను ఒక ప్రత్యేక వాతావరణంలో జీవిస్తున్నాడు. ఇక్కడ అతనికి ప్రతికూలంగా, అనుకూలంగా కొన్ని శక్తులు బలంగా పని చేస్తున్నాయి. అతను మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఈ అనుకూల శక్తుల వల్ల ప్రయోజనం పొందడం ఎలా? ప్రతికూల శక్తుల నుండి తప్పించు కోవడం ఎలా? అన్నదే అతని ఆలోచన, అన్వేషణకు అంతిమ గమ్యంగా నిలిచింది. తాను జరిపిన పరిశోధనా మత్తులో అతను ఆ విశ్వకర్తనే నిందించాడు. ఆయనకే పోలికలు కల్పించే దుస్సాహసం చేశాడు. ఇదే విషయాన్ని విశ్వకర్త అయిన అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నాడు: "వాడు మమ్మల్ని (ఇతరులతో) పోల్చాడు. కానీ (మరోవైపు) తన పుట్టుకనే మరచి పోయాడు. 'కుళ్ళి కృశించిపోయిన ఎముకలను ఎవడు బ్రతికిస్తాడు?' అని (మాకే) సవాలు విసురుతున్నాడు. (ఇలా) చెప్పు: 'వాటిని తొలిసారి సృష్టించినవాడే (మలిసారి) కూడా బ్రతికిస్తాడు'. (యాసీన్: 78,79)

తన పుట్టుక ఎందు నిమిత్తం జరిగింది? తనెందుకు ఈ లోకంలో ఉన్నాడు? జీవిత గడువు ముగిశాక చచ్చి తాను ఎక్కడికి వెళ తాడు? తాను చేసుకున్న పాపపుణ్యాల పర్యవసానం ఏమిటి? నిరాఘాటంగా, నిర్విఘ్నంగా, నిరంతరాయంగా ఓ కట్టుదిట్ట మయిన నియమానికి లోబడి నడుస్తున్న ఈ విశ్వ వ్యవస్థ చివరికి ఏమవుతుంది? వీటి గురించి అతను అస్సలు ఆలోచించలేదు. ఫలితం - నిజ దైవజ్ఞానం లేని భక్తి మానవ సమాజం పాలిట ప్రమాదంగా మారినట్టే, వాస్తవ దైవం పట్ల భక్తి లేని విజ్ఞానం వినాశకాలకు కారణభూతమయింది. అదే అతను 'సృష్టికి కర్త ఉన్నాడు, అతను ఒక్కడే' అన్న యదార్థాన్ని అంగీకరించి ఉంటే నేడు అతను వైజ్ఞానికంగా గొప్ప విజయాల్ని సాధించి కూడా పరిష్కరించుకోలేకపోతున్న అనేకానేక సమస్యలు ఇట్టే సులభంగా పరిష్కారం అయ్యేవి. అంటే దైవాన్ని విశ్వసించడంతోపాటు అనేక శక్తుల్లో విశ్వాసం గలవారు, విగ్రహారాధకులు సృష్టి పూజారులు 'లా ఇలాహ' అంటూ సృష్టికర్త వ్యవహారంలో సృష్టిరాసుల జోక్యాన్ని నిరాకరించాలి. ఈ సృష్టికి కర్త అనేవాడే లేడు, ఉన్నా అతన్ని నమ్మడం వల్ల ప్రయోజనం లేదు అని అనుకునేవారు 'ఇల్లల్లాహ్' ఒక్క అల్లాహ్ మాత్రమే ఈ సృష్టి మొత్తాన్ని నియమబద్ధంగా నడుపుతున్నాడన్న యదార్థాన్ని అంగీకరించాలి. 'లా ఇలాహ' అన్న అనంగీకారం, 'ఇల్లల్లాహ్' అన్న అంగీకారంతో మానవాళి సైద్ధాంతిక పరమయిన, మత పరమయిన దొంతరలు, ద్వంద ప్రమాణాలు, సమస్యలు పరిష్కారం అవుతాయి. ఇదే నేపథ్యంలో దైవ ప్రవక్త ముహమ్మద్(స) మానవాళిని 'ఖూలూ లా ఇలాహ ఇల్లల్లాహ్ తుఫ్లిహూ' అని ఘంటాపథంగా పిలుపునిచ్చారు. లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలుకరండి ఓ ప్రజలారా!

(మిగతా వచ్చేవారం)

మనిషి శరీరం దేవుడు ప్రసాదించిన వరం. ఈ శరీరంలో ప్రాణం దేవుడు పోశాడు. అతడి శరీరావయవాలన్నింటినీ దేవుడు ఆదేశించి వున్నాడు (మనిషి ఇష్టానుసారంగా అవి పని చేయాలని).

- మనిషి పూర్తిగా దేవుడి అధీనం (యాజమాన్యం)లో ఉన్నాడు. తనకు తాను యజమాని కాడు.
- తన శరీరంలోని ఒక్క రోమానికీ (వెంట్రుకకి) యజమాని కానప్పుడు, మనిషి తన పూర్తి శరీరానికి యజమాని ఎలా అవుతాడు? ఇతరులపై పెత్తనం ఎలా చెలాయిస్తాడు?
- మనిషికి ఈ శరీరం ఇవ్వబడింది, దానిని ధర్మసమ్మతమైన ఆహారంతో పోషించమనీ, శరీరావయవాలతో దేవుని ఆదేశాలను, ఇష్టాలను నెరవేర్చడానికి సహాయం తీసుకోమనీ.
- మేధస్సుతో మంచీ, నిర్మాణాత్మకమైన విషయాలు ఆలోచించమనీ.
- చెడు, నిరాశాజనకమైన ఆలోచనల నుండి హృదయాన్ని పరిశుద్ధంగా వుంచమనీ.
- మంచీ– సాధు సాంగత్యంలో జీవితం గడపమనీ.

అప్పుడే అతను పరీక్షల నెగ్గగలడు.

('దావత్' సౌజన్యంతో)



హుమైరా అమీర్, ఏలూరు

కుష్టు వ్యాధి వేల సంవత్సరాలుగా మానవాళిని ప్రభావితం చేసింది. ఇది శరీరమంతా పుండ్లతో కనిపించే ఒక అంటువ్యాధి (infectious decease). కుష్టు వ్యాధికి కారకమైన బ్యాక్టీరియా పేరు మైక్రోబ్యాక్టీరియం లెప్రే (Mycobacterium leprae). 1873వ సంవత్సరంలోనే హాన్సెన్ గెర్హార్డ్ అర్మౌర్ హాన్సెన్ అనే నార్వే శాస్త్రవేత్త కుష్టు వ్యాధి కారకమైన సూక్ష్మ జీవిని సూక్ష్మదర్శినితో కనుగొన్నాడు. హాన్సెన్ గెర్హార్డ్ అర్మౌర్ హాన్సెన్ ఒక నార్వే వైద్యుడు కూడా. అందువల్లనే కుష్టు వ్యాధిని హేన్సన్ వ్యాధి అని కూడా పిలుస్తారు.

ఈ వ్యాధి ముఖ్యంగా చర్మాన్ని, నరాలనూ, మ్యూకస్ పొరనూ ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధిలో ఇన్ఫెక్షన్ మూలంగా నరాలు, శ్వాసకోశ నాళాలు, చర్మం, కళ్ళు దెబ్బతింటాయి. నరాలు దెబ్బతినడం వలన నొప్పిని అనుభవించే సామర్థ్యాన్ని మనిషి కోల్పోయే అవకాశం ఉంది. తద్వారా కొన్ని గుర్తించబడని గాయాల కారణంగా గాని, లేదా ఇన్ఫెక్షన్ కారణంగా గానీ, ఒక వ్యక్తి శరీరంలోని అంత్య భాగాలు (అంటే కాలి వేళ్ళు చివరి భాగం, చేతి వేళ్ళ చివరి భాగం) కోల్పోయేలా చేస్తుంది. అంతేకాదు ఈ వ్యాధి సోకిన వ్యక్తికి కండరాల బలహీనత, బలహీనమైన కంటి చూపు కూడా రావచ్చు. కానీ ఈ వ్యాధి అంత సులభంగా అంటుకునే అంటు వ్యాధి కాదు. ఇది నాడీసంబంధమైన దీర్ఘకాలిక వ్యాధి. కుష్టు వ్యాధి లక్షణాలు ఒక సంవత్సరంలోనే ప్రారంభమవుతాయి. కానీ, కొంతమందిలో లక్షణాలు కనిపించ డానికి 20 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ సమయం పట్టవచ్చు.

కుష్టు వ్యాధి అత్యంత పురాతనమైన వ్యాధులలో ఒకటి. కుష్టు వ్యాధికి సంబంధించిన మొట్టమొదటి లిఖిత సూచన 600 B.C నుండి ఉంది.

ప్రధాన లక్షణాలు

- కండరాల బలహీనత
- చేతులు, పాదాలు, కాళ్లలో తిమ్మిరి
- చర్మ గాయాలు

చర్మ గాయాలు, స్పర్శ కోల్పోయిన అనుభూతిని కలిగిస్తాయి. కొన్ని వారాల తర్వాత కూడా అవి నయం కావు. అవి సాధారణ స్కిన్‌టోన్ కంటే తేలికగా ఉంటాయి లేదా మంట కారణంగా ఎర్రబడి ఉండవచ్చు.

చాలామందిలో కుష్టు వ్యాధి నయం కాని మొండి వ్యాధి అనే ఒక అపోహ ఉంది. ఈ వ్యాధి నిర్ధారణ, చికిత్స గతంలోకంటే ఇప్పుడు సులభంగాను, మరింత ప్రభావవంతంగాను ఉంది. 1983 నుండి బహుళ ఔషధ చికిత్స (Multi Drug Theraphy) ద్వారా ఈ వ్యాధిని సమర్థవంతంగా నయం చేయగలుగుతు న్నారు. బహుళ ఔషధ (మల్టీడ్రగ్) చికిత్స కుష్టు వ్యాధికి ఒక నమ్మకమైన చికిత్స. ఈ చికిత్సతో వ్యాధి ఏ దశలోనైనా నయమవుతుంది. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అంగవైకల్యం కూడా నివారించవచ్చు.

ఈ సందర్భంలో లా కమిషన్ ఆఫ్ ఇండియా వెలువరించిన 256వ నివేదికను పరిశీలిస్తే, 'కుష్టు వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులపై వివక్షను నిర్మూలించాలని' స్పష్టం అవుతుంది. ఈ నివేదిక ముఖ్యంగా 2005 నుంచి కుష్టునిర్మూలన పథకంలో వైఫల్యాలను ఎత్తిచూపింది. ఈ నివేదికలో ముఖ్యంగా ఈ రోగ బాధితుల పట్ల సమాజం చూపే చిన్నచూపు గురించి కూడా ప్రస్తావించింది. 2010లో ఐక్యరాజ్యసమితి కుష్టు సోకిన వారిపట్ల ఎటువంటి వివక్ష చూపకూడదని చేసిన తీర్మానం గురించి కూడా గుర్తు చేసింది. రాజ్యాంగంలో ప్రతి పౌరునికి అందవలసిన ఆత్మాభి మానం, సమానత, స్వేచ్ఛల విషయంలో లా కమిషను

నివేదిక స్పష్టమైన సిఫారసులు చేసింది. కుష్టువ్యాధి సోకిన వ్యక్తుల పట్ల వివక్షను చూపించకుండా ఉన్నప్పుడే భారతదేశం జరిపే కుష్టు వ్యాధి వ్యతిరేక పోరాటంలో నూతన అధ్యాయం ఆరంభం అవుతుంది. అంగవైకల్యం కలవారి హక్కులను గౌరవిస్తూ అంతర్జాతీయంగా 2007లో కొన్ని తీర్మానాలు జరిగాయి. వాటిని అనుసరించడం మన కర్తవ్యం. న్యాయం చేయవలసిన చట్టాలే కొన్నిసార్లు వీరి పట్ల వివక్షను చూపుతున్నాయి. ఈ రోగ బాధితులను వివక్ష నుండి దూరం చేస్తూ, ఉద్యోగాల్లో, విద్యాసంస్థల్లో చేర్చి ప్రధాన జనవాహినిలో కలసిపోయే విధంగా ఎటువంటి చట్టాలు లేవు.

కుష్టువ్యాధి బాధితులు ప్రత్యేకంగా, సమాజానికి దూరంగా కాలనీల్లో ఉంటూ జన జీవనానికి దూరంగా వివక్షతో జీవనం గడపవలసిన పరిస్థితుల్లో ఉన్నారు. భారతదేశంలో ఇటువంటి కుష్టువ్యాధి కాలనీలు సుమారు 850 ఉన్నాయి. ఈ కాలనీల్లో సుమారు 2,00,000 పైగా కుష్టు వ్యాధి పీడిత జనాభా ఉందంటేనే మనకు అర్థమవుతుంది ఈ వ్యాధి బాధితులు సమాజంలో ఎంత వివక్షకు గురవుతున్నారో, ఎన్ని నిందలు భరిస్తున్నారో.

అసలు ఈ కుష్టు వ్యాధి అనేది ఎలా వస్తుంది? కుష్ఠువ్యాధి ఇతర అంటు వ్యాధుల వలె సూక్ష్మ క్రిములు, మైక్రో బాక్టీరియా ద్వారా సంక్రమించే ఒక అంటు వ్యాధి. ఈ వ్యాధి, వ్యాధిగ్రస్తుని నుండి గాలి ద్వారా, సన్నిహిత సాన్నిధ్యం ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తి ముక్కు నుండి కారే ద్రవంతో, దగ్గు ద్వారా లేదా సంపర్కం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని భావించబడుతుంది. ఒక వ్యక్తి కుష్టు వ్యాధికి గురయ్యే విషయంలో అతని జన్యుపరమైన కారకాలు, అతని రోగనిరోధక పనితీరు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. కుష్టు వ్యాధి గర్భధారణ సమయంలో పుట్టబోయే బిడ్డకు సంక్రమించదు. అలాగే ఇది లైంగిక సంపర్కం ద్వారా కూడా వ్యాపించదు. కుష్టువ్యాధి పేదరికంలో నివసించే వ్యక్తులలో ఎక్కువగా కనిపిస్తుంది.

కుష్టు వ్యాధిని ఎలా గుర్తిస్తారు? శరీరంపై పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలు ఉన్నప్పుడు, ఆ మచ్చలపై స్పర్శజ్ఞానము లేనపుడు, నొప్పి తెలియనపుడు, పాదాలు, చేతులు, వ్రేళ్లు తిమ్మిర్లు ఉన్నప్పుడు, చర్మం దళసరిగా మొద్దుబారిపోయి ఉన్నప్పుడు, చర్మం ముఖ్యంగా ముఖం నూనె రాసినట్లు నిగనిగలాడుతూ కన్పించినపుడు అవి కుష్టు వ్యాధి లక్షణాలుగా అనుమానించి వైద్యుణ్ణి సంప్రదించాలి. కుష్టు వ్యాధిగా అనుమానించిన వెంటనే సమీపంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనా కేంద్రంలో చూపించుకుని, వెంటనే వైద్యం ప్రారంభించాలి. వ్యాధి తీవ్రతను అనుసరించి 6 నెలలు లేదా 12 నెలలు క్రమం తప్పకుండా ఔషధాలు వాడవలసి ఉంటుంది.

కుష్టువ్యాధి గురించి వ్యక్తిగత బాధ్యతలేమిటి? ఎవరిలోనైనా కుష్టు వ్యాధి ప్రారంభ చిహ్నాలను గమనించినట్లయితే వెంటనే వైద్య పరీక్షకు ప్రోత్సహించడం మనందరి వ్యక్తిగత బాధ్యత. అంతేకాదు కుష్టు వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబీకులు వివక్షకు గురి కాకుండా ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి.

అదేవిధంగా ప్రభుత్వం కూడా ఈ వ్యాధికి గురయినవారిని, వారి కుటుంబాలను వివక్ష నుండి దూరంగా ఉంచేందుకు ప్రజలకు సరైన శిక్షణ మరియు అవగాహన కల్పించాలి. విద్య, ఉద్యోగ, వివాహ విషయాల్లో కుష్టు రోగులకు, వారి పిల్లలకూ అందరితో సమానంగా అవకాశాలు కల్పించాలి.

కుష్టు వ్యాధిని అనుభవించే వ్యక్తులపై సమాజం చూపే ఒక విధమైన కళంకం, వివక్ష, ఒంటరితనం కారణంగా ఆ వ్యాధి బాధితులు ఎన్నో మానసిక సవాళ్లను ఎదుర్కొంటూ ఉంటారు. నిజానికి వారు కూడా అందరిలాగానే కళంకం మరియు వివక్ష లేని గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి హక్కు కలిగి ఉంటారు. ఈ హక్కును వారికి ఇచ్చేందుకే ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి చివరి ఆదివారం నాడు జరుపుకుంటున్నారు.

ఈ సంవత్సరం ఇది 30 జనవరి, 2022 న వస్తుంది. "యునైటెడ్ ఫర్ డిగ్నిటీ" అనే నినాదంతో కుష్టు వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి, కుష్టు వ్యాధిగ్రస్థులు ఎదుర్కొనే నిందలను, వివక్షను అంతం చేయాలనీ పిలుపునిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రపంచ కుష్టు వ్యాధి దినోత్సవాన్ని జరుపుతారు. "యునైటెడ్ ఫర్ డిగ్నిటీ" అనే ప్రచారంతో కుష్టు వ్యాధిగ్రస్తుల గౌరవం, ఐక్యతకు పిలుపునిస్తారు. ఈ ప్రచారం ద్వారా కుష్టు వ్యాధిగ్రస్తుల, కుష్టు వ్యాధిని అనుభవించిన వారి జీవిత అనుభవాలను గౌరవించడం జరుగుతుంది. కుష్టు వ్యాధిగ్రస్తుల సాధికారత, వారి కథనాలను పంచుకోవడం మరియు వారికి మానసిక స్థైర్యాన్ని అందించడం, తద్వారా వారికి వ్యాధి-

సంబంధిత కళంకం లేని గౌరవప్రదమైన జీవితాన్ని అందించడం కోసం కృషి చేయడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం.

2018లో, ప్రపంచవ్యాప్తంగా 209,000 కుష్టువ్యాధి కేసులు నమోదయ్యాయి. 1994 నుండి 2014 వరకు 20 సంవత్సరాలలో, ప్రపంచవ్యాప్తంగా 16 మిలియన్ల మంది ప్రజలు కుష్టు వ్యాధి నుండి నయమయ్యారు. యునైటెడ్ స్టేట్స్‌లో సంవత్సరానికి 200 కేసులు నమోదవుతున్నాయి. కుష్టు వ్యాధి బారిన పడిన వ్యక్తులను కుష్టురోగుల కాలనీలలో ఉంచడం ద్వారా వారిని వేరు చేయడం ఇప్పటికీ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలోను, చైనా, ఆఫ్రికా ఖండాలలోను, థాయ్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాలలో జరుగుతోంది.

LepVax అనే వ్యాక్సిన్ 2017లో క్లినికల్ ట్రయల్స్ మొదలుపెట్టింది. ఈ క్లినికల్ ట్రయల్స్‌లో మొదటిసారిగా పాల్గొన్న 24 మందికి ప్రోత్సాహకరమైన ఫలితాలు వచ్చాయని 2020లో ప్రకటించింది. ఇది కనుక విజయవంతమైతే, కుష్టు వ్యాధి నిరోధానికి అందుబాటులో ఉన్న మొదటి నిర్దిష్టమైన వాక్సిన్ LepVax అవుతుంది.

కుష్టు వ్యాధి వేగంగా వ్యాపించే అంటు వ్యాధి కాదు. అయినప్పటికీ, చికిత్స చేయని వ్యక్తితో ఎక్కువ కాలం సన్నిహితంగా, పదేపదే సంప్రదింపులు జరిపితే అది కుష్టు వ్యాధికి దారి తీయవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఈ వ్యాధికి సగటు పొదిగే కాలం (ఇన్ఫెక్షన్, మొదటి లక్షణాల మధ్య సమయం) ఐదు సంవత్సరాలు. ఒక్కోసారి 20 సంవత్సరాల వరకు లక్షణాలు కనిపించకపోవచ్చు.

ఆయా సందర్భాలు - దైవ స్మరణలు

- ఏ పనైనా చెయ్యతలచుకొన్నప్పుడు "ఇన్షా అల్లాహ్" (అల్లాహ్ తలిస్తే) అని చెప్పాలి.
- అల్లాహ్ పేరుతో ఏదైనా దానం చేస్తున్నప్పుడు "ఫీసబీ లిల్లాహ్" (అల్లాహ్ మార్గంలో) అనాలి.
- ఏదైనా మంచి వార్త విన్నప్పుడు "సుబ్‌హానల్లాహ్" (అల్లాహ్ పరిశుద్ధుడు) అని చెప్పాలి.
- ఏదైనా బాధలో ఉన్నప్పుడు "యా అల్లాహ్!" (ఓ అల్లాహ్!) అని చెప్పాలి..
- ఏ పనైనా మొదలు పెట్టినప్పుడు "బిస్మిల్లాహ్" (అల్లాహ్ పేరుతో) అని చెప్పాలి.
- ఏ వస్తువునైనా పొగడదలిస్తే "మాషా అల్లాహ్" (ఏదైతే అల్లాహ్ తలచునో) అని చెప్పాలి.
- ఎవరికైనా ధన్యవాదములు చెప్పవలసి వచ్చినప్పుడు "జజాకల్లాహ్" (అల్లాహ్ నీకు బదులు ఇవ్వుగాక) అని చెప్పాలి.
- నిద్రపోయి లేచినప్పుడు "లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప వేరే దేవుడు లేడు అని చెప్పాలి.
- తుమ్మినప్పుడు "అల్‌హమ్దులిల్లాహ్" (సర్వ స్తోత్రాలు అల్లాహ్ కొరకే) అని చెప్పాలి.
- తుమ్మిన వారు అల్హమ్దులిల్లాహ్ అన్నప్పుడు దాన్ని విన్న వారు "యరహాముకల్లాహ్" (అల్లాహ్ నీ మీద దయతలచు -గాక) అని చెప్పాలి.
- మనవల్ల ఏదైనా తప్పు జరిగిందని తెలిసినప్పుడు "అస్తగ్ఫిరుల్లాహ్" (నేను అల్లాహ్‌ను క్షమాపణ వేడుకొంటున్నాను) అని చెప్పాలి.
- ఎవరికైనా వీడ్కోలు చెప్పవలసి వచ్చినప్పుడు "ఫీ అమానిల్లాహ్" (అల్లాహ్ సంరక్షణలో) అని చెప్పాలి.
- ఏదైనా ఇష్టంలేని మాట విన్నప్పుడు "నవూజుబిల్లాహ్" (మేము అల్లాహ్ శరణు కోరుతున్నాము) అని చెప్పాలి.
- ఏదైనా శుభవార్త విన్నప్పుడు "ఫతబారకల్లాహ్" (అల్లాహ్ నీవు అన్నీ సమకూర్చువాడివి) అని చెప్పాలి.
- ఏదైనా దుర్వార్త విన్నప్పుడు "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్" (మేము అల్లాహ్ వాళ్ళమే. ఆయన సన్నిధికే మేము మరలిపోవలసిన వారము) అని చెప్పాలి.
- ఏ విషయములోనయినా అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుప గోరినప్పుడు "అల్‌హమ్దులిల్లాహ్" (సకల స్తోత్రాలు అల్లాహ్ కొరకే) అని చెప్పాలి.

ఈ విధంగా మనం మన పిల్లలకు బాల్యం నుండే సందర్భాన్ని బట్టి దైవ స్మరణ చేయటం నేర్పితే వారు తమ జీవితాంతం వీటిని అనుసరించగలరు.

మానవుడు ఈ భూప్రపంచంపై అడుగు పెట్టినప్పుడు మొట్టమొదట అతనికి తల్లి దండ్రులతో పరిచయ సంబంధాలు ఏర్పడ తాయి. శిశువు పుట్టి కళ్ళుతెరవడానికి కారణ మైన వారిద్దరూ ఆ చిన్నారిపై అపరిమితమైన ప్రేమానురాగాలు కలిగి, తమ సర్వస్వాన్ని ధారపోయడానికి సిద్ధంగా ఉంటారు. ఆ శిశువు తల్లిదండ్రుల ప్రేమాభి మానాలకు కేంద్రబిందువుగా మారిపోతాడు. దైవం ప్రసాదించిన అపురూపమైన కానుకగా భావించి, ఆ చిన్నారిని ప్రాణప్రదంగా చూసు కుంటారు ఆ పసికూనను. పెంచి పోషించి ఉన్నత శిఖరాలకు చేర్చడానికి తమ సంతోషాలను ధన ప్రాణాలను ధారపోస్తారు. తమ బిడ్డకు ఏ కాస్త సుస్తీ చేసినా వారు తల్లడిల్లిపోతారు. అతన్ని గొప్ప వ్యక్తిగా సమాజానికి అందించడానికి, విద్యాబుద్ధులు నేర్పించి, సర్వస్వాన్ని అర్పించడానికి వెనుకాడరు. ఇంతటి ప్రేమానురాగాలను పంచి త్యాగాలు చేసిన తల్లిదండ్రుల రుణం ఏమిచ్చి తీర్చుకోవాలి? అందుకే సృష్టికర్త తన తరువాత అందరికంటే ముఖ్యమైన హక్కు తల్లిదండ్రులదే అని ఆజ్ఞాపిం చాడు.

కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఫలవంతంగా ఉండాలంటే, హక్కులు బాధ్యతల సమన్వయం సంతులనంగా ఉండి తీరాలి. అదృష్టవంతుల కుటుంబాలు తప్ప ఈనాడు ప్రతి కుటుంబంలో సంతానం తమ మాట వినడం లేదన్న ఏడుపే వినబడుతోంది. "మా అమ్మాయి మాట వినడం లేదు. ఎడ్డం అంటే తెడ్డం అంటోంది. ఎంత చెప్పినా నా మాటకు "విలువ ఇవ్వదు" అని ఒక తల్లి ఆవేదన. "ఇరవై ఏళ్ళైనా మా అబ్బాయిని అర్థం చేసుకోలేక పోతున్నాను. రాను రాను ప్రతి విషయంలో గొడవపడుతున్నాడు. తన తండ్రినన్న విషయం కూడా మరిచి పోతున్నాడు" అని ఒక తండ్రి ఆందోళన. అసలు ఎందుకీ సమస్య? తల్లిదండ్రులు!! ఒక్క సారైనా ఆలోచించారా? తప్పంతా పిల్లలదే అంటూ వారిపై నెట్టే విషయంలో తమ పాత్ర ఎంత ఉందో ఒకసారి సమీక్షించుకోవలసిన అవసరం ఉంది. పిల్లలు తమ తల్లిదండ్రుల ఔన్నత్యాన్ని గుర్తించడం లేదు. తల్లిదండ్రు లను గౌరవించడం, వారికి విధేయత చూపాలన్న భావనే వారి మనసుల్లో నుండి తుడిచి పెట్టుకుపోయింది. ఇలాంటి పరిస్థితిలో తల్లిదండ్రులు ఒక విషయాన్ని గురించి ఆలోచించవలసిన అవసరం ఉంది. పరిస్థితులు ఈ విధంగా తీవ్రరూపం దాల్చడా నికి, ఇలాంటి అనైతికత ప్రబలడానికి తమ పాత్ర కూడా ఏమైనా ఉందా? సంతానం చదువు సంధ్యలు, వారి శిక్షణ సంస్కారాలకు సంబంధించి తమ బాధ్యతల నిర్వహణలో ఎక్కడైనా లోపం జరుగుతోందా? అని తల్లిదండ్రులు ప్రశ్నించుకోవాలి. పిల్లల భవిష్యత్తుకు సంబంధించి ఏమన్నా విరుద్ధ భావాలు ఉన్నాయా అని ఆలోచించాలి.

పిల్లల మనోభావాలు చాలా సున్నితంగా ఉంటాయి. వారి భావోద్వేగాలు అపరిపక్వంగా ఉండటం సహజం. అయితే పిల్లలతో తల్లిదండ్రులు మంచి సంబంధం కలిగి ఉంటున్నారా? ఇది అంత సులభమేమీ కాదండోయ్! పిల్లలు, కొన్ని సమయాలలో, తమ అనుభూతులు ఆలోచనలను గమనించినా వాటిని మనకు వివరించలేరు. కానీ వాటి పట్ల ఎంతో ఆకస్మికంగా స్పందిస్తారు. అలాంటప్పుడు తల్లిదండ్రులు వారి పట్ల ఎంతో నైపుణ్యంతో వ్యవహరించవలసి ఉంటుంది. తల్లిదండ్రులు ఎంతో ఓర్పుతో వారిని అర్థం చేసుకో వలసి ఉంటుంది. మనస్ఫూర్తిగా మాట్లాడి వారి ఆలోచనలను, భావాలను తెలుసుకోవడం మరీ అంత కష్టమైన పనేమీ కాదు. వారి కోసం రోజులో ఎంతో కొంత సమయం కేటాయించాలి. వారితో ముందు మంచి అనుబంధం పెంచుకోవాలి. వారితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడాలి. వారిని వారి భావాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. మరో విషయం ఏమిటంటే, మీ పిల్లలు మీ హక్కులు నెరవేర్చాలంటే మీ ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకునే వారుగా రూపొందాలంటే మీరు కూడా మీ బాధ్యతలను హృదయ పూర్వకంగా నిర్వర్తించాలి..

తల్లిదండ్రుల పట్ల పిల్లల సత్ప్రవర్తన, వారి పట్ల గౌరవం, విధేయతలకు సంబంధించి, ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ హితవులు బోధిస్తున్నాయి. పవిత్ర ఖుర్ఆన్ ఎంతో ప్రభావవంతంగా, విప్లవాత్మకంగా, హృదయాలను కదిలించే విధంగా స్పష్టమైన హితవులు చేసింది. "తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తనతో మెలగండి. ఇది ఆ సర్వేశ్వరుడి నిర్ణయం" (23: 24). కాని దీనికి భిన్నంగా నేటి సమాజంలో పిల్లలు, తల్లిదండ్రుల హక్కుల్ని విస్మరిస్తున్నారు. తల్లిదండ్రులు వృద్ధులై ఉంటే వారిని 'ఉఫ్' అని కూడా విసుక్కోకండి. కసురుకుంటూ మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి. దయార్ద్ర హృదయంతో, వినయంతో వారి ముందు నిలబడండి. వారు మనల్ని చిన్నతనంలో ఎలా కరుణతో వాత్సల్యంతో పెంచిపోషించారో అలాగే ఆ ప్రభువు వారిని కరుణించాలని ప్రార్థించండి" అనే ప్రస్తావన ఉంది. తల్లిదండ్రుల స్థానమేమిటి? వారి విధేయత వారి సేవలో ఎలా తరించాలి? అసలు వారి ఔన్నత్యం ఏమిటి? అన్న విషయాలే సంతానానికి బోధించకపోతే, వారు తల్లిదండ్రుల హక్కులను ఎలా తెలుసుకోగలరు? మీకు వారి భావాలను గురించి ఆలోచించే తీరికే లేకపోతే, వారిని నిర్లక్ష్యం చేస్తే వారు మిమ్మల్ని ఆదర్శంగా ఎలా చూడగలరు. మిమ్మల్ని వారు ఎందుకు గౌరవిస్తారు? మీరు మీ శిక్షణ ద్వారా వారిని ఎలా మలిచారో అవే వారి నుండి ఆశించండి. అన్ని రంగాల్లో పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు ఎంతో శ్రమ పడవలసి ఉంటుంది. ఇక్కడ ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పట్ల ఎంతో ప్రేమ చూపిస్తున్నారని, ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వారికి తెలియజేయాలి. పిల్లలతో ఏ విధంగా అనుబంధం పెంచుకోవాలనే అంశంపై మానసిక నిపుణులు ఈ విధంగా కొన్ని సూచనలు అందిస్తున్నారు.

పిల్లలకు మీ ప్రేమ వ్యక్తం చేస్తున్నారా?

ప్రేమను వ్యక్తపరచడానికి ఉన్న శక్తి చాలా ఉందండోయ్! తరచూ వారిని మనం ప్రేమిస్తున్నామని పిల్లలకు చెబుతుండాలి. ఈ ప్రేమను కేవలం మాటలకే పరిమితం చేయకుండా భౌతికంగా వ్యక్తం చేయాలి. ఇలా చేయడం ద్వారా అమ్మానాన్నలు ఎప్పుడూ తమకు తోడుగా ఉంటారని నమ్ముతారు. దీంతో వారు ధైర్యంగా అన్ని విషయాలనూ మనతో పంచుకుంటారు. వారికి మనపై నమ్మకం పెరుగుతుంది.

వారికి ఎంత సమయం కేటాయిస్తున్నారు?

ఎంత బిజీగా ఉన్నా ఎన్ని పనులు ఉన్నా పిల్లలతో రోజులో ఎంతో కొంత సమయం గడపడం అనివార్యం. వారితో మాట్లాడాలి. వారు రోజంతా ఏం చేస్తారో తెలుసుకోవాలి. ఇలా సమయం కేటాయించడం వల్ల పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య బంధం మరింత దృఢపడుతుంది.

వారి భావాలను గమనిస్తున్నారా?

వారి ఇష్టాయిష్టాల గురించి తెలుసుకోవాలి. అప్పుడు ఇరువురి మధ్య బంధం ఏర్పడుతుంది. ఒకవేళ వారు ఎంపిక చేసుకున్నవి సరికాదు అని మీకు అనిపిస్తే వెంటనే కరాఖండిగా చెప్పకూడదు. ఇలా చేయడం వల్ల వారు నిరుత్సాహపడతారు. వారు ఎంపిక చేసుకున్నవి ఎందుకు వద్దంటున్నారో అర్థమయ్యే పద్ధతిలో నెమ్మదిగా నచ్చజెప్పాలి. చిన్న పిల్లలలో కూడా మానసిక స్థాయి ఎంతో గొప్పగా ఉంటుందని మరచిపోకూడదు.

వారి అభిప్రాయాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారు?

తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను పిల్లల మీద రుద్దడం కన్నా వారిని సొంతంగా ఆలోచించే వైపు ప్రోత్సహించాలి. నిర్ణయాలు తీసుకునేటప్పుడు, వారి అభిప్రాయాలను తెలుపమని కోరాలి. ఇందువల్ల వారికి ప్రాధాన్యం ఇస్తున్నామని వారు భావిస్తారు. మన ఆలోచనలను గౌరవిస్తారు. తల్లిదండ్రుల కారుణ్యచ్ఛాయలో పిల్లలు ఎదిగి కుటుంబ, సామాజిక బాధ్యతలను చేపట్టి వాటిని సక్రమంగా నెరవేర్చే స్థాయికి చేరగానే తల్లిదండ్రుల వృద్ధాప్య దశ ప్రారంభమవుతుంది. అప్పుడు ఏమైనా చేద్దామన్నా వయసు వారికి సహకరించదు. వృద్ధ తల్లిదండ్రులు ఆత్మ స్థయిర్యాన్ని కోల్పోయి, నిరాశా నిస్పృలకు లోనవుతారు. వారిలో ఆరోగ్యం క్షీణించడం వల్ల అసహనం, చిరాకు జనిస్తాయి. ఏ కొద్ది మాటనైనా ఇట్టే పట్టుకుంటారు. మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, పట్టించుకోవడం లేదని ఏ విషయంలోనూ సంప్రదించడం లేదని గింజుకుంటూ ఉంటారు. ఇలాంటి సున్నిత సందర్భాల్లో పిల్లలు వారిని వారు నిగ్రహించుకొని, సహనం కోల్పోకుండా ఉండాలి. తల్లిదండ్రులను చీదరించుకోకూడదు. వారు మనకు జన్మనిచ్చిన వారని ఎప్పుడూ మరువకూడదు. వారు మన పసితనంలో ఎంతో ప్రేమ, వాత్సల్యాలతో తమ సర్వస్వాన్నీ త్యాగం చేసి తమ శక్తి సామర్థ్యాలను పిల్లలకు అర్పితం చేశారని గుర్తు చేసుకుంటే ఈ పరిస్థితి ఏర్పడదు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు మంచి స్నేహితులుగా మెలగాలి. వారి భావాలను అర్థం చేసుకోవాలి. వారిని గౌరవించాలి. పిల్లలనే పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే వారు ముందు ముందు సామాజికంగా ఇబ్బందులు కలిగిస్తారు. అసాంఘీక వ్యక్తులుగా మారుతారు. పిల్లలు, పెద్దలూ ఇరువురు పరస్పర గౌరవం ఇచ్చుకోవాలంటే ముందు ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టాలి. ఎవరికి వారు సమీక్షించు కోవాలి. అట్టి కుటుంబాల్లోనే శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయి.

ఆ పార్టీని ఓడించాలి

ఆంగ్లేయులను తరిమికొట్టి దేశానికి ముక్తి కల్పించే అవకాశం ప్రజలకు దక్కింది. ఇప్పుడు బీజేపీని ఓడించే ఛాన్స్ ప్రజలకు వచ్చిందని జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మహ్‌బూబా ముఫ్తీ అన్నారు. ఆ పోరాటం కంటే ఇదే పెద్ద పోరాటం. ఎందుకంటే బీజేపీ వాళ్ళు ఈ దేశాన్ని మతాల వారీగా విభజించాలని చూస్తున్నారని ఆరోపించారు. జమ్ము కశ్మీర్ ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాలని పార్టీ కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు.

నాసా టెలిస్కోప్ లాంచింగ్‌లో హాషిమా హసన్ కీలక పాత్ర

భారత సంతతి మహిళా శాస్త్రవేత్త డాక్టర్ హాషిమా హసన్ నాసా వెబ్‌స్పేస్ టెలిస్కోప్ లాంచింగ్‌లో కీలక పాత్ర పోషించారు. ఈమె లక్నో యూనివర్సిటీ, అలీగడ్ యూనివర్సిటీలో ఉన్నత విద్యనభ్యసించారు. ఆ తరువాత వాషింగ్టన్ డీసీలోని నాసా హెడ్ క్వార్టర్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా సేవలు ప్రారంభించారు. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్‌లో డిప్యూటీ ప్రోగ్రామ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అఖిలేష్‌కు దీదీ మద్దతు

సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్‌కు మద్దతుగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ యూపీ ఎన్నికలలో ప్రచారం చేయనున్నారు. ఫిబ్రవరి 8న లక్నోలో జరిగే వర్చువల్ ర్యాలీలో ఆమె ప్రసంగించనున్నారు. ఆ తరువాత వారణాసి నియోజకవర్గంలోనూ అఖిలోష్‌కు మద్దతుగా తృణమూల్ కాంగ్రెస్ రంగంలోకి దిగనుంది. మమత బెనర్జీ మాత్రం యూపీ ఎన్నికల బరిలో దిగడం లేదు. అన్ని సీట్లను అఖలేష్‌కే ఇచ్చేశారు.

ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు ఉండదు

యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు ఉండదని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ అవేసి తేల్చి చెప్పారు. ఆయన ఒక వార్తా చానల్‌తో మాట్లాడుతూ.... యూపీలో బీజేపీ అధికారంలోకి రాకుండా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. తాము 100 స్థానాల్లో పోటీ చేస్తామని, అక్కడ పార్టీ ఎలాంటి సామర్థ్యం కనబరుస్తుందో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంఐఎం బీజేపీకి బీ టీం అనే ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తమ పార్టీ బీజేపీకి బీ టీం కాదని స్పష్టం చేశారు.

టిప్పుసుల్తాన్ కాలం నాటి పురాతన మస్జిద్‌ను కూల్చుతామని బెదిరింపు

కర్ణాటక శ్రీరంగ పట్నంలోని 236 యేళ్ళ పురాతన జామియా మస్జిద్‌ను కూల్చుతామని బెదిరిస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సెక్యూరిటీ సూపర్ వైజర్ ఫిర్యాదు మేరకు కాలికా మఠ్‌కు చెందిన రిషి కుమార్ స్వామిని పోలీసులు నిర్బంధించారు. ఈ మస్జిద్ 1786లో టిప్పుసుల్తాన్ కాలంలో నిర్మించడం జరిగింది. దీనిని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షిస్తుంది.

వారిని కఠినంగా శిక్షించాలి

ఒక మతానికి చెందినవారిని లక్ష్యంగా చేసుకొని విద్వేష ప్రసంగాలు చేయటం రాజ్యాంగ విరుద్ధమే కాదు, తీవ్రమైన నేరమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రోహింటన్ పాలీ నారీమన్ అన్నారు. ముంబయిలోని స్కూల్ ఆఫ్ లా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విద్వేష ప్రసంగాలు చేసేవారికి కనీస శిక్ష పడేట్టు చూడాలని పాలకులకు ఆయన సూచించారు. కావలసి వస్తే దీనికోసం చట్ట సవరణలు కూడా చేయాలన్నారు. విశ్వనాథ్ కారిడార్ ప్రాజెక్టు ప్రారంభ సమయంలో ఔరంగజేబ్, శివాజీ ద్వయాన్ని ఉపయోగించి మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రధాని మోడీ చేసిన ప్రసంగాన్ని ఆయన ఖండించారు. మొఘల్ చక్రవర్తి ఔరంగ జేబుని ఆక్రమదారుడిగా, చెడ్డ వ్యక్తిగా పేర్కొనడం, లౌకిక నేతగా శివాజీని పేర్కొనడం ద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రధాని మోడీ వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొన్నారు.

అమెరికా దౌత్య కార్యాలయంపై రాకెట్ దాడి

ఇరాక్‌లోని అమెరికా దౌత్య కార్యాలయంపై మరోసారి రాకెట్ దాడి జరిగింది. రాజధాని బగ్దాద్‌లో పటిష్టమైన భద్రత నడుమ ఉన్న ఈ కార్యాలయంపై దుండగులు దాడి చేశారు. అంతర్యుద్ధంతో నిత్యం అల్లకల్లోలంగా ఉండే ఇరాక్‌లో అమెరికా దళాలు, కార్యాలయాలే లక్ష్యంగా దాడులు జరగడం సర్వ సాధారణమయ్యాయి. తాజా పేలుళ్ళకు తామే బాధ్యులమని ఇప్పటి వరకు ఎవరూ ప్రకటించలేదని ఇరాక్ సైన్యం తెలిపింది.

ఇండోనేషియా కొత్త రాజధాని 'నుసంతరా'

ఇండోనేషియా రాజధాని మారింది. ఇప్పటివరకు ఉన్న జకార్తా స్థానంలో 'నుసంతరా'ను దేశ రాజధానిగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇండోనేషియా పార్లమెంటులో రాజధానిని మార్చుతూ ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. జావానీస్ భాషలో నుసంతరా అంటే దీవుల సమూహం అని అర్థం. జకార్తాలో తీవ్రమైన కాలుష్యం, అధిక జనాభా సమస్యల నేపథ్యంలో రాజధానిని మార్చాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది.

ఉమ్రా పర్మిట్ల జారీలో సౌదీ కీలక ప్రకటన

ఉమ్రా పర్మిట్ల జారీ విషయంలో సౌదీ కీలక ప్రకటన చేసింది. విదేశీ యాత్రికులతో సహా అన్ని వయసుల యాత్రికులకు రెండు ఉమ్రా పర్మిట్‌ల జారీకి మధ్య 10 రోజుల విరామం తప్పనిసరి అని వెల్లడించింది. సౌదీకి వచ్చే విదేశీ యాత్రికులు తమ 30 రోజుల పర్మిట్‌లో గరిష్టంగా మూడు ఉమ్రాలను చేసుకోవచ్చని మంత్రిత్వ శాఖ పేర్కొంది. పర్మిట్ పొందిన యాత్రికుడు మొదటి ఉమ్రా చేసిన 10 రోజుల తర్వాత ఈతమర్నా లేదా తవక్కల్నా యాప్‌ల ద్వారా రెండో ఉమ్రా కోసం అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవచ్చని మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఇటీవల కరోనా కేసులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు, నివారణ ప్రోటోకాల్‌లో భాగంగా పది రోజుల పరిమితిని విధించినట్లు ఈ సందర్భంగా మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.

ఉక్రెయిన్ బలగాలకు అమెరికా శిక్షణ!

ఉక్రెయిన్ ప్రత్యేక బలగాలకు అమెరికా శిక్షణ ఇస్తోంది. ఈ మేరకు యాహూ పోర్టల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఉక్రెయిన్‌లో రహస్యంగా సాగుతున్న ప్రత్యేక బలగాల శిక్షణా కార్యక్రమానికి అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సిఐఎ) ఇన్‌చార్జిగా వుందని ఆ బలగాల సభ్యులే యాహూ పోర్టల్‌కు తెలిపారు. ఆయుధాలు ఉపయోగించడం, మభ్యపెట్టే సాంకేతికతలను వినియోగించడం, నావిగేషన్, ఇంటెలిజెన్స్, ఇతర రంగాల్లో ఈ శిక్షణ కొనసాగుతోంది. అయితే ఒకవేళ రష్యా దాడి జరిపిన పక్షంలో రష్యా సైనిక బలగాలను ప్రతిఘటించేందుకు గానూ ఉక్రెయిన్ బలగాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని సీనియర్ అధికారి తెలిపారు.

ముస్లిమ్ దేశాలు మా ప్రభుత్వాన్ని గుర్తించాలి

ముస్లిమ్ దేశాలు తమ ప్రభుత్వాన్ని గుర్తించాలని అఫ్గానిస్తాన్ ప్రధాని ముల్లా ముహమ్మద్ హసన్ అఖుంద్ కోరారు. కాబుల్‌లో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ముస్లిమ్ దేశాలు అఫ్గానిస్తాన్ ప్రభుత్వాన్ని గుర్తించడానికి ముందుకు రావాలని, దాంతో తాము వేగంగా అభివృద్ధి చెందుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

GLOBAL TIMES
DISCOVER CHINA, DISCOVER THE WORLD

భారత్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు

భారతదేశంలో మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయని చైనాకు సంబంధించిన ఒక పత్రిక వెల్లడించింది. గ్లోబల్ టైమ్స్ పత్రిక భారతదేశంలో అతివాద మూకలు ముస్లిములను, క్రైస్తవులను ఇతర వర్గాల వారిని లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నాయని పేర్కొంది. ఇంత జరుగుతున్నా పాశ్చాత్య దేశాలు ఏం చేస్తున్నాయని నిలదీసింది.

23వ పేజీ తరువాయి

మొదలైన సంఘ దురాచారాలు రూపుమాసిపోతాయి. వాటికి బదులుగా ప్రేమ, వాత్సల్యాలు, సానుభూతి, శాంతిభద్రతలు, సమభావం, సామాజిక సమానత్వం మొదలైన ఉత్తమ విలువలు సమాజంలో అలరారుతాయి. ఈ విధమైన ఉత్తమ విలువల వలన నిరంతర సంకోచాలు, అనుమానాలు, భంగపాటు మొదలైన మానసిక రుగ్మతలు దూరమై మానసిక శాంతి ఏర్పడుతుంది. రిలీజియస్ మనస్సు, సైంటిఫిక్ మనస్సు ఈ రెండు రకాల మనస్సులే సత్యాన్వేషణకు సమర్థవంతమైనవి. శాస్త్రీయ దృక్పథం ఉన్నవారు సత్యాన్ని చూసి జంకరు. అది తమకు అనుకూలమైనా, ప్రతికూలమైనా సరే. అలాగే ఆధ్యాత్మికుడు అయిన విశ్వాసి తన అంతర్లోకంలో ఉన్నది ఉన్నట్లు వెలువడే సత్యాన్ని చూడగలుగుతాడు. ప్రకృతి పరిశీలన ద్వారా నిజ దైవాన్ని గుర్తించి, ఆ నిజ దైవ నిరూపణకై తాను అగ్నిగుండంలో దూకి తాను నమ్మిన నిజ దైవానికి నికార్సయిన తార్కాణాన్ని చూపిన వారు ఇబ్రాహీమ్ (అ) ప్రవక్త. ఇబ్రాహీమ్(అ) ఒక పూజారి కుటుంబంలో జన్మించినా 'విశ్వ పరిశోధన' ద్వారా విశ్వప్రభువును గుర్తించిన మహనీయులు. తాను శోధించి సాధించిన నిజ ప్రభువు అల్లాహ్ అనే దృఢ విశ్వాసాన్ని తన జీవితానికి అన్వయించుకుని ఆచరించి చూపిన వారు ప్రవక్త ఇబ్రాహీం(అ). ఆధ్యాత్మిక మనస్సు ద్వారానే ప్రవక్త ఇబ్రాహీం(అ) నిజదైవాన్ని గుర్తించగలిగారు.

ఇప్పుడు మనం సైంటిఫిక్ మనస్సు గురించి తెలుసుకుందాం. ఒక చక్కటి ఉదాహరణ ద్వారా ఈ విషయాన్ని గ్రహించటానికి ప్రయత్నిద్దాం. జగదీష్ చంద్రబోస్ వృక్ష జాతికి కూడా ప్రాణం ఉన్నదని ప్రయోగాల ద్వారా రుజువు చేసిన భారతీయ శాస్త్రజ్ఞుడు. ఈ విషయం అందరికీ తెలుసు. మొక్కలకు విషం ఇంజెక్టు చేస్తే అవి వెంటనే చచ్చిపోతాయి అనే విషయాన్ని రుజువు చేసేందుకు లండన్‌లో ఒక ప్రయోగాన్ని ఏర్పాటు చేశాడు. అందరి సమక్షంలో మొక్కకు టేబుల్ మీద ఉన్న విషపు ఇంజక్షన్ ఇచ్చినప్పటికీ ఆ మొక్క మరణించలేదు. భారతీయ శాస్త్రజ్ఞుడి వైఫల్యం చూసి అక్కడ 'జాత్యాహంకారం' ప్రబలంగా ఉన్న శ్వేత జాతీయులు ఎగతాళిగా నవ్వసాగారు. కానీ జగదీష్ చంద్రబోస్ మొక్కలకు ప్రాణమున్నదన్న సత్యం అబద్ధమయ్యే అవకాశం ఎంత మాత్రం లేదనే అత్యంత ఆత్మ విశ్వాసంతో తిరిగి అదే విషాన్ని తను ఎక్కించుకోవాలని తద్వారా ఇంజక్షన్ సిరంజిలో తాను నింపినది ఆ మొక్కను చంపలేకపోతే అదే విషం వలన తాను కూడా మరణించలేనని భావించి నిరూపణకై సిద్ధమయ్యాడు జగదీష్ చంద్రబోస్. వెంటనే ఒక శ్వేత జాతీయుడు లేచి మీ ప్రయోగం విఫలం అని నిరూపించటానికి మీరు మొక్క కోసం ఎక్కించిన సిరంజిలోని విషాన్ని తీసి రంగు నీళ్ళు ఎక్కించాను. అందువల్లనే ఆ మొక్క చావలేదు. కానీ మీరే ఆ సిరంజిలోకి విషం నింపి సాక్షాత్తు మీ మీదే ప్రయోగం చేయబోతారని నేను ఊహించలేదు. అంటూ తన తప్పును క్షమించమని విన్నవించుకున్నాడు. సైంటిఫిక్ రంగంలో శాస్త్రజ్ఞుడు కనుగొన్నట్లే ఆధ్యాత్మిక రంగంలో సత్యాన్ని మనిషి స్వయంగా కనుగొనాలి. ఆ విధంగా శోధించి సాధించిన సత్యం అడుగుజాడల్లో నడిచే వ్యక్తికి అంతస్సంఘర్షణ ఉండదు. అన్వేషించి శోధించిన విషయాన్ని ప్రకటించడానికి, ఆచరించటానికి భయ సందేహాలుండవు. ఏక దైవత్వం పట్ల విశ్వాసం కలిగి ఉండటం మానవ నైజంలోనే ఇమిడి ఉంది. ఈ నమ్మకం వల్లనే ఇహపర లోకాల్లో శాంతి భద్రతలు లభిస్తాయి. నిజ ప్రభువును గుర్తించటానికై దివ్య ఖుర్ఆన్ సర్వ మానవాళిని బహిరంగంగా ఆహ్వానిస్తుంది. ఈనాటి శాస్త్ర సాంకేతిక రంగంలో జీవిస్తున్న మనం రిలీజియన్ మనస్సు, సైంటిఫిక్ మనస్సుల ద్వారా సత్యాన్వేషణ గావించి నిజదైవాన్ని గుర్తించి సద్బుద్ధిని ప్రసాదించాలని సృష్టికర్త అల్లాహ్‌ను వేడుకుందాం. (ఆమీన్)

తు ది గీ టు



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**